


కోటప్పకొండ ప్రాంతంలో వరి పొలం

ధాన్యం ధర పతనం

- పది రోజుల్లో బస్తాకు రూ. 400 తగ్గించేశారు
- చోద్యం చూస్తున్న పౌరసరఫరాల శాఖ
- కొనుగోలు కేంద్రాల ఊసెత్తని వైనం
- ఉమ్మడి జిల్లాలో 4.49 లక్షల ఎకరాల్లో వరి సాగు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) ఖరీఫ్‌లో అన్నదాతలు విస్తృతంగా వరి సాగు చేశారు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. వరి నూర్పిడులు ప్రారంభమయ్యాయి. తెనాలి ప్రాంతం, పల్నాడు జిల్లాలోని నకరికల్లు, ఈపూరు, రాజుపాలెం మండలాల్లో వరి నూర్పిడులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎకరాకు 30 నుంచి 40 బస్తాలు (75కిలోలు) ధాన్యం దిగుబడి వస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ధాన్యం చేతికొచ్చే సమయానికి ధర తగ్గిపోతుండటంతో అన్నదాతలు ఆవేదనకు లోనవుతున్నారు. వ్యాపారులు ఒక్కసారిగా ధరను తగ్గించి వేశారు. పది రోజుల వ్యవధిలోనే బస్తా కు రూ 400 వరకు ధర తగ్గించారు. మద్దతు ధర కన్నా కూడా బస్తాకు రూ 300 నుంచి రూ 400 వరకు మార్కెట్‌లో ధర తక్కువగా ఉండడం గమనార్హం. రైతుకు ధాన్యం వచ్చే సమయంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుకు మద్దతు ధర వచ్చేలా చేయాలి. కానీ పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. గత ఏడాది సాగు నీటి కరువుతో రైతులు వరి సాగును కోల్పోయారు. ఈ ఏడాది సకాలంలో సాగు నీటి సరఫరా చేయడంతో వరి సాగుకు రైతులు మొగ్గు చూపారు. సాగర్ ఆయకట్టులో

(మిగతా 6వ పేజీలో..)



కలగానే.. కనీస వేతనం

పదిహేనేళ్ల క్రితం నిర్ణయించిన కనీస వేతనమే ఈరోజుకూ కష్టజీవులకు అమలవుతోందంటే నమ్మగలరా? రాష్ట్రంలో అక్షరాలా అదే జరుగుతోంది. ఎప్పుడో 2010లో నిర్ణయించిన కనీస వేతనాలే కష్టజీవులు, అసంఘటితరంగ కార్మికులకు అమలవుతోంది. ఎప్పుడో 2017కి ముందే జరగవలసిన కనీస వేతన సవరణ ఇప్పటికీ జరగకపోవడంతో కష్టజీవులు, అసంఘటితరంగ కార్మికులు తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ఈ ఏడున్నరేళ్లలో నిత్యావసర సరుకులు, సేవల ధరలు 200 శాతానికి మించి పెరిగి, కార్మికుల జీవన వ్యయం అనేక రెట్లు పెరిగింది. అయినప్పటికీ కార్మికుల వేతనాలు మాత్రం పెంపుదలకు నోచుకోలేదు.

- వేతన మెరుగుదల కోసం కష్టజీవుల ఎదురు చూపులు
- ఇప్పటికీ పదమూడేళ్లనాటి కనీస వేతనమే దిక్కు
- గత ప్రభుత్వ హయాంలో సలహాబోర్డు ఏర్పాటు
- 2018లోనే రాష్ట్రమంతటా సలహాబోర్డు ఛైర్మన్
- ప్రభుత్వం మారడంతో సిఫార్సులు బుట్టదాఖలు
- జిల్లాలో 17 లక్షల మంది కష్టజీవులకు అన్యాయం

గుంటూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 2014 తరువాత కనీస వేతన సవరణ లేకపోవడంతో కార్మికులు ఆందోళనలు చేపట్టారు. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం 2018లో వేతన సవరణపై కసరత్తు ప్రారంభించింది. పెరుగుతున్న ధరలు, జీవన ప్రమాణాల ఆధారంగా వేతన సవరణకు సంబంధించి నివేదికను సిద్ధం చేయాలని సలహాబోర్డును ఆదేశించింది. వేతన సలహా మండలి చైర్మన్ రామ్మోహన్‌రావు నేతృత్వంలోని బృందం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటన నిర్వహించి కార్మికులు, కార్మిక సంఘాలతో సమావేశాలు నిర్వహించింది. ఈ సందర్భంగా కనీస వేతనాన్ని 21 వేలుగా నిర్ణయించాలని కార్మిక సంఘాలన్నీ ముక్తకంఠంతో నినదించాయి. దీంతోపాటు కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను, కార్మికుల డిమాండ్లను నమోదు చేసి సలహా సంఘం వేతన సవరణపై నివేదికను సిద్ధం చేసింది. సరిగ్గా అదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో మొత్తం ప్రక్రియ

(మిగతా 8వ పేజీలో..)

పైసలిస్తేనే.. పీఎఫ్ రుణం

పల్నాడు జిల్లా ఫిరంగిపురం మండలంలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడు రూ. 5లక్షల రుణం కావాలని జిల్లా పరిషత్ (జడ్పీ) పీఎఫ్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నాడు. వాస్తవంగా నెలలోపు రుణం మంజూరు కావాలి....అయితే డిప్యూటీ సీఎం వద్ద పనిచేసే ప్రత్యేక అధికారి జోక్యంతోనే రుణం మంజూరు అయింది... బాపట్ల ప్రాంతానికి చెందిన మరొక ఉపాధ్యాయుడు కుమార్తె వివాహం కోసం రుణం కావాలని దరఖాస్తు చేశాడు... దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా రుణం మాత్రం మంజూరు కాలేదు. జడ్పీ సిబ్బంది పెట్టే కొర్రీలకు ఆయన విసుగెత్తిపోయి చివరకు అంతో ఇంతో ముట్టజెప్పి రుణం పొందాల్సిన దుస్థితి...మరొక ఉపాధ్యాయుడు రిటైర్‌మెంట్ బెనిఫిట్ కోసం చేసిన దరఖాస్తుకు ఇప్పటి వరక అతీగతి లేదు. చివరకు ఉపాధ్యాయుల డెత్ క్లయిమ్ దరఖాస్తులు క్లియర్ చేయడానికి పర్సంటేజీలు లేనిదే పనికావడం లేదని ఉపాధ్యాయ సంఘాలు ధ్వజమెత్తుతు న్నాయి. ఇలా ఆరునెలల్లో దాదాపు రూ. 100 కోట్లు క్లయిమ్‌లకు జడ్పీ సిబ్బంది కొర్రీలు వేసి వెనక్కి పంపారని వారు ఆగ్రహం వెలిబుచ్చుతున్నారు.



- మంజూరులో జడ్పీ సిబ్బంది కాసులు వేట
- మెడికల్ సర్టిఫికెట్స్ పేరుతో బేరాలు
- ఆరు నెలల్లో రూ.100కోట్లుపైగా చెల్లింపులకు కొర్రీలు

గుంటూరు(విద్య),నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల యాజమాన్యాల్లో(జడ్పీ, మండల పరిషత్) పనిచేసే ఉపాధ్యాయులు దాదాపు 10వేల మందికిపైగా ఉన్నారు. ఆయా ఉపాధ్యాయులు తమ జీతం నుంచి కొంత మొత్తం జడ్పీ పీఎఫ్ అకౌంట్‌లో జమచేస్తారు. ఇందులో రూ.5వేల నుంచి రూ.25వేల వరకు ఉపాధ్యాయులు తాము తీసుకుంటున్న జీతాల ఆధారంగా ఈ మొత్తం జమచేస్తారు. ఈ మొత్తాల నుంచి అవసరమైన వారు రుణాలు తీసుకుంటారు. ఉపాధ్యాయుల పిల్లల వివాహాలు, ఉన్నత చదువులు కోసం, ఇంటి నిర్మాణం కోసం, వైద్య బిల్లులు చెల్లింపులు ఇతరత్రా ఆర్థిక అవసరాల కోసం రుణాలు తీసుకుంటారు. జడ్పీ పీఎఫ్ అకౌంట్‌లో ఉన్న తమ డబ్బునే వారు రుణాల రూపంలో తీసుకుంటారు. అయితే ఈ రుణాలు చెల్లింపుకు జడ్పీలో ఈ అండ్ ఎఫ్ విభాగాలు కీలకంగా పనిచేస్తాయి. ప్రాథమిక

(మిగతా 8వ పేజీలో..)

ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల.. నిర్మాణం జరిగేనా?

- ఒక్కో దానికి 250 చదరపు గజాల భూమి అవసరం
- భూములు కేటాయించకుండా జాప్యం చేస్తున్న రెవెన్యూ శాఖ
- 39 గ్రామాల్లో వీటి నిర్మాణంపై సందిగ్ధం


ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం నమూనా

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి అన్నిరకాల వైద్య సేవలు వారికి సమీపంలోనే అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణం జిల్లాలో ముందుకు సాగడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్‌గా స్టిక్కర్ వేసి కేంద్ర ప్రభుత్వ కార్యక్రమానికి మసి పూసింది. గ్రామాల్లో 250 చదరపు గజాల భూమిని కేటాయిస్తే ఈ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణం జరిగేవే. అయితే భూముల కేటాయింపులో నిర్లక్ష్యం వహించింది. దీంతో జిల్లాలోని చాలా గ్రామాల్లో నేటికీ ఎక్కడ స్థలం కేటాయించాలనేదే గుర్తించలేకపోయారు. ఈ విషయంపై దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దార్లు తక్షణమే భూములను గుర్తించి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు కేటాయించాలని ఆదేశించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పీహెచ్‌సీలలో గర్భిణీలు, శిశు ఆరోగ్య సంరక్షణ సర్వీసులే అందుబాటులో ఉంటాయి. వీటికి అదనంగా నాన్-కమ్యూనికబుల్ వ్యాధులు, పాలియేటివ్, రీహేబిలిటేటివ్ కేర్, ఓర్ ఐ, ఈఎన్‌డీ కేర్, మెంటల్ హెల్త్, ఎమర్జన్సీలు, ట్రామాలో తొలి దశ చికిత్స, అవసరమైన మందులు, ల్యాబ్‌ల పరీక్షలు ఉచితంగా కల్పించడమే ఈ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ఏర్పాటు ప్రధాన లక్ష్యం.

ఇవేకాకుండా క్రానిక్ కమ్యూనికబుల్ వ్యాధులైన టీబీ, కుష్టు వంటి వాటిని అదుపు చేసేందుకు కూడా వీటిల్లో వైద్య సేవలు అందిస్తారు. అలానే గర్భిణీ, శిశుజననం, నియోనేటల్, ఇన్‌ఫ్యాండ్ హెల్త్, రక్తహీనత, కుటుంబ నియంత్రణ, బాల్యం సమస్యలకు కూడా వైద్యసాయం అందజేస్తారు.

జిల్లాలో మేడికొండూరు మండలంలోని కొర్రపాడు, పేరేచర్ల-2, పెదకాకానిలోని నంబూరు-4, పెదకాకాని-1, తక్కెళ్లపాడు-1, వెనిగండ్ల, పెదనందిపాడులోని పుసులూరు, వరగాని, పెదనందిపాడు-1, తాడికొండలోని పొన్నెకల్లు-2, తాడికొండ-3, తుళ్లూరులోని మందడం, పెదపరిమి-2, తుళ్లూరు-2, వట్టిచెరుకూరులోని చమళ్లమూడి(వింజనంపాడు-2), చేబ్రోలులోని పాతరెడ్డిపాలెం, సుద్ధపల్లి, చేబ్రోలు-2, దుగ్గిరాలలోని చిలువూరు-2, దుగ్గిరాల వెస్టు, శృంగారపురం, మంగళగిరిలోని పెదవడ్లపూడి-2, పొన్నూరులోని కసుకర్రు, ఉప్పరపాలెం, తెనాలిలోని కొలకలూరు-1, నందివెలుగు-1, కొవెవరం-2, పెదరావూరులో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను నిర్మించాల్సి ఉన్నది. వీటిల్లో చిలువూరు-2, దుగ్గిరాల పశ్చిమలో మాత్రమే భూములను సేకరించారు. మిగతా చోట్ల పెండింగ్‌లో ఉన్నాయి. ఎంతో బృహత్తరమైన ఈ కార్యక్రమానికి భూముల కేటాయింపులో తహసీల్దార్లు నిర్లక్ష్యం వహిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వేమెన్ చీటీ.. చాలా కాస్ట్లీ

- రూ. 35 లక్షలకు చేతి మార్పిడులు
- కొన్ని నెలల తర్వాత పాలకవర్గానికి నివేదించి ఆమోదముద్ర

గుంటూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)లో వేమెన్ చీటి అత్యంత ఖరీదుగా మారిపో యింది. ఒకప్పుడు రూ.వేలల్లోనే ఉన్న ఈ చీటి ఏటా అంతకం తకు డిమాండ్ పెరుగుతూ నేడు రూ.35 లక్షలకు చేరుకొన్నది. అయినప్పటికీ డిమాండ్ ఉంటూనే ఉన్నది. ఇందుకు కారణం మిర్చి టిక్కీల తూకం వేయడం ద్వారా వచ్చే ఆదాయమే కా కుండా ప్రతీ నెలా చాలామందికి అక్రమార్జన ఉంటుండటమే ఇందుకు కారణంగా మారింది. వేమెన్‌ల నియామకానికి సం బంధించి మార్కెటింగ్ చట్టంలో పటిష్టమైన నిబంధనలు లేకపోవడంతో ఇలా లైసెన్సుల మార్పిడులు యదేచ్ఛగా జరు గుతున్నాయి. ఇందుకు కొంతమంది అధికారులు సహకారం కూడా ఉంటుండటంతో ఎలాంటి ఆటంకాలు ఉండటం లేదు. మార్కెటింగ్‌శాఖ కొత్తగా వేమెన్ లైసెన్స్‌లు ఇవ్వాలని ఆలోచన చేస్తే వెంటనే న్యాయస్థానాలను ఆశ్రయించి వాటికి సంబం ధించి నిలుపుదల ఉత్తర్వులు తెచ్చుకొంటున్నారు.

మిర్చియార్డు ఏర్పాటైన తొలినాళ్లలో చాలామంది రైతులు వారి భూములను యార్డు కోసం ఇచ్చారు. దాంతో వారు ఉపా ది కోల్పోయారు. ప్రత్యామ్నాయంగా అప్పటి ప్రభుత్వం ఆలోచ న చేసి వేమెన్ పోస్టులను మంజూరు చేసింది. వీటికి ఎలాంటి సర్వీసు రూల్స్ అనేవి లేవు. మిర్చియార్డులో మొత్తం 115 వేమెన్ పోస్టులున్నాయి. యార్డులోని దిగుమతి



దుకాణాలే కాకుండా గోడౌన్లు, కోల్డ్‌స్టోరేజ్‌లు కూడా వీరి పరిధిలోనే ఉంటాయి. మిర్చి కొనుగోళ్లు జరిగిన తర్వాత కాటాలు వేసి వేమెన్ స్లిప్పు ఇస్తేనే సరుకు బయటకు పోయేందుకు అనుమతిస్తారు. వేమెన్‌లకు ఒక్కో మిర్చి టిక్కీ తూకం వేసినందుకు రూ. 4.23 పైసలు లభిస్తాయి. ఏటా మిర్చియార్డుకు కోటి 20 లక్షలకు పైగా మిర్చి టిక్కీలు వస్తున్నాయి. ఈ లెక్కన కాటా వేసినందుకు రూ. 5 కోట్లకు పైగా వచ్చే ఆదాయం 115 మంది వేమెన్‌లకు వస్తుంది. ఈ విధంగా నెలకు సగటున రూ. 40 వేల వరకు ఆదాయం వస్తుంది. ఇక జీరో బిజినెస్ వీళ్లకు తెలియకుండా జరిగే వ్యవహారం కాదన్నది బహిరంగ రహస్యమే. దీని రూపంలోనే అదనపు ఆదాయం సమకూరుతుంది.

వేమెన్ లైసెన్సుల విషయంలో తగిన నిబంధనలు లేకపోవడంతో విచ్చలవిడిగా చేతులు మారిపోతున్నాయి. ఆదాయం దండీగా ఉండటంతో రూ. 35 లక్షలు పెట్టడానికి అయినా ఎవరూ వెనకాడటం లేదు. ఇంత పెద్ద మొత్తం పెట్టి వేమెన్ చీటి తీసుకొన్న వారు ఆ తర్వాత దానిని సక్రమం చేసుకొంటున్నారు. ఉన్న నిబంధనల ప్రకారం వేమెన్ లైసెన్సు మార్పు అనేది రక్త సంబంధీకులకే జరగాలి. అయితే లైసెన్సు కొనుగోలు చేసిన వారు రెవెన్యూ అధికారులను ప్రసన్నం చేసుకొని రక్తసంబంధీకులు కాకపోయినా అవునని సర్టిఫికేట్ తెచ్చుకొని మార్కెటింగ్ అధికారులకు నివేదించి పేరు మార్పించుకొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొన్ని వేమెన్ లైసెన్సులకుకూడా పేరు మార్పులు చేశారు. యార్డులో వేమెన్‌లు ఎవరనేది తెలియకుండా ఉండటంతో వారంతా డ్రస్‌కోడ్, ఐడీ కార్డులు ధరించి కాటాలకు హాజరు కావాలని తాజాగా పర్సన్ ఇన్‌ఛార్జ్ ఏ భార్గవతేజ, సెక్రెటరీ ఆంజనేయులు ఆదేశాలు జారీ చేశారు. అలానే జీరో బిజినెస్‌లో భాగస్వామ్యం అయితే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

డీఈవో.. ద్వంద్వ వైఖరి

- ప్రమాదశాత్తు గోడకూలితే నలుగురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు
- జడ్పీ పాఠశాల విద్యార్థి మరణించినా కనీసం దర్యాప్తు చేయని వైనం
- తన వారిని రక్షించాలని నాటి డీఈవో విశ్వప్రయత్నాలు
- పొన్నెకల్లు జడ్పీ స్కూల్ సంఘటనపై పలు అనుమానాలు



గుంటూరు(విద్య),నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు పెదకాకానిలోని యాదవపాలెం ఎంపీపీ స్కూల్‌లో పాఠశాల ప్రహారి గోడ, గేటు కూలీ ముగ్గురు విద్యార్థులకు స్వల్పగాయాలు అయ్యాయి. దీంతో నాటి డీఈవో శైలజకు ఎక్కడలేని నిబంధనలు గుర్తుకువచ్చాయి. నాటి కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఉత్తర్వులంటూ ఏకంగా పాఠశాల హెచ్‌ఎంతోపాటు ముగ్గురు ఉపాధ్యాయుల్ని సస్పెండ్ చేసింది. అంతేకాకుండా ఆమె డీఈవోగా పనిచేసిన సమయంలో అనేక మంది ఉపాధ్యాయులకు చిన్న చిన్న తప్పులకే నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేశారు. అయితే గతనెల 24న పొన్నెకల్లు జడ్పీ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని సహచర విద్యార్థులే కొట్టి బావిలో తోశారని తీవ్ర ఆరోపణలు వచ్చినా కనీసం స్పందించలేదని విషయం బయట ప్రపంచానికి తెలియనివ్వలేదనే ఆరోపణలు ఉన్నాయి. సంఘటనపై అంతర్గతంగా తూతూ మంత్రంగా విచారణ చేసి నివేదిక బుట్టదాఖలు చేశారు. అక్కడ పనిచేసే ఉపాధ్యాయులు, పీఈటీ నిర్లక్ష్యాన్ని బయట ప్రపంచానికి తెలియకుండా తెలివిగా వారి రక్షణగా నిలిచి కాపాడాలని ప్రయత్నించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కనీసం బాధ్యులైన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు కూడా ఇవ్వకుండా సంఘటనకు కారణమైన ఉపాధ్యాయుల్ని రక్షించే ప్రయత్నాలు చేసినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక దశలో సంఘటనపై పోలీసు కేసు కూడా నమోదు కాకుండా నాటి డీఈవో మేనేజ్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో పాఠశాలలో కీలక బాధ్యతలు నిర్వహించే ఉపాధ్యాయురాలు, పీఈటీతో భారీ డీలింగ్ నడిచినట్లు ఆరోపణలు ఉన్నాయి. చివరకు మరణించిన విద్యార్థి బంధువులు విషయం కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

ఆ పీఈటీపై అనేక ఆరోపణలు

పొన్నెకల్లు జడ్పీ స్కూల్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న పీఈటీపై ఇప్పటికే అనేక ఆరోపణలు ఉన్నాయి. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యహరించినందుకు గతంలో రెండుసార్లు సస్పెండ్ అయ్యారని చెబుతున్నారు. గత నెల 24న కూడా ఆయన నిర్లక్ష్యం వల్లే పాఠశాలలో డ్రిల్ సమయంలో విద్యార్థులు బయటికి వెళ్ళిపోయి తోటి విద్యార్థి మరణానికి కారణం అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకుల అండ చూసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ పీఈటీ డీఈవో కార్యాలయాన్ని అడ్డాగా మార్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వార్షిక క్రీడల నిర్వహణ, విద్యాశాఖకు సంబంధించి చేసే అనేక కార్యక్రమాల్లో అన్నీ తానై కీలకంగా వ్యవహరించే వారని ఫిర్యాదులు ఉన్నాయి. జిల్లాకు ఎవరు డీఈవోగా వచ్చినా ఆయన హవా సాగేది. డీఈవోగా శైలజ వచ్చిన తరువాత కూడా ఆయన డీఈవో కార్యాలయంలో కీలకంగా వ్యవహరించే వారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే సదరు పీఈటీని రక్షించేందుకు నాటి విద్యాశాఖ అధికారి శైలజ ప్రయత్నించారని ఆరోపణలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం డీఈవో సీవీ రేణుక విద్యార్థి మరణంపై డీవైఈవోచేత విచారణ చేయిస్తున్నారు. త్వరలో నివేదిక కలెక్టర్‌కు అందజేస్తారని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

వీరుల ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

కారంపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కారంపూడి పట్టణంలో ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్న వీరుల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి అన్నారు. సోమవారం కారంపూడిలో వీరుల ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఐదు రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వసతులను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచి సరస్వతిబాయి, బాలునాయక్, పంగులూరి అంజయ్య, పుల్లయ్య చప్పిడి రాము, మునుగోడు సత్యం, గోళ్ల సురేష్ యాదవ్, బొల్నేడి శ్రీనివాసరావు, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, మాజీ ఎంపీపీ నాగులు నాయక్, బొమ్మిని శేషగిరి, రాముడు, దోర్నాల బ్రహ్మారెడ్డి, గాడిపత్రి పూర్ణయ్య, తోట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ ఫోర్స్ మాజీ ఉద్యోగి సీకే రావుకు ఘన నివాళి



పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎయిర్ ఫోర్స్ సిబ్బంది

అచ్చంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ ఫోర్స్ మాజీ ఉద్యోగి సీకే రావు(60) అనారోగ్యంతో ఆదివారం అచ్చంపేటలో మృతి చెందారు. సీకే రావు ఎయిర్ ఫోర్సులో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందారు. బాపట్ల సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి ఆరుగురు బృందం వచ్చి సీకే రావు భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. భౌతికకాయంపై గౌరవ సూచికంగా త్రివర్ణ పతాకం ఉంచారు. సార్జంట్(ఎస్‌జీటీ) పవన్ నేతృత్వంలో శ్రద్ధాంజలి ఘటించారు. చిత్తూరు జిల్లా పుత్తూరులోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) చల్లా జానకి, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సతీమణి భాష్యం లావణ్య సీకే రావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పలువురు టీడీపీ నాయకులు మృతుని కుటుంబానికి సంతాపం తెలిపారు.

రైలు కింద తల పెట్టి ఆత్మహత్య

తెనాలి క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి కదులుతున్న రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం తెనాలి రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఎస్‌ఐ జి.వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు.. సుమారు 30-35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ఐదో నంబరు ప్లాట్‌ఫారంపై కదులుతున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి చెందిన వ్యక్తిగత సమాచారం లభించకపోవడంతో కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీఆర్డీఏ భూముల్లో సాగు చేయవద్దు

- త్వరలో రాజధాని పనులు ప్రారంభం
- గ్రామాల్లో అధికారుల ప్రచారం



అనంతవరంలో ప్రచారం చేస్తున్న సీఆర్డీఏ యూనిట్ తహసీల్దార్ రవి బాబు

తుళ్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'త్వరలో రాజధాని పనులు పునఃప్రారంభమవుతున్నాయి. ఆ పనులకు ఎటువంటి అడ్డంకులు కలిగించవద్దు. వేసిన పంటలు తొలగించుకోండి.. సీఆర్డీఏ భూముల్లో ఎటువంటి సాగు తలపెట్టవద్దు.' అని సీఆర్డీఏ అధికారులు రాజధాని గ్రామాల్లో తిరిగి సోమవారం ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతవరం గ్రామంలో యూనిట్ తహసీల్దార్ రవిబాబు, ఫెసిలిటేటర్స్ రైతులకు పంటలు వేయవద్దని తెలిపారు. రాజధాని గ్రామాల్లో కొంతమంది సీఆర్డీఏ భూములు ఆక్రమించి సాగు చేస్తున్నారని, ఇక నుంచి అటువంటి వాటికి తావు లేదని సీఆర్డీఏ అధికారులు స్పష్టం చేశారు. కాదని సాగు చేస్తే కేసులు నమోదు చేయడమేగాక, పంట నష్టం కూడా జరుగుతుందని తెలిపారు. ఈ విషయాలను గ్రామాల్లో రైతులు ప్రచారం చేసి రాజధాని నిర్మాణ పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఆక్రమించి సాగు చేస్తున్నట్టు తెలిస్తే తుళ్లూరు సీఆర్డీఏలో ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు.

ధాన్యం ధర పతనం

(5పేజీ తరువాయి)

కాలువల చివరి భూముల్లో గత నెలలో వరి నాట్లు పూర్తయ్యాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 4.49 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్టు వ్యవసాయ శాఖ ప్రకటించింది. గత ఏడాది కంటే వరి సాగు గణనీయంగా పెరిగింది. పల్నాడు జిల్లాలో 87,740 ఎకరాల్లో వరి సాగు చేశారు. బాపట్ల జిల్లాలో 2,20,903 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 1,40,935 ఎకరాల్లో వరి సాగయింది. సగటున ఎకరాకు 30 బస్తాలు అంటే 22.50 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. అన్ని ప్రాంతాల్లో ఈ నెలాఖరుకు ముమ్మరంగా వరి నూర్పిడిలు జరగనున్నాయి.

ధాన్యం రైతుల ఇంటికి చేరే సమయానికి వ్యాపారులు ధరలు తగ్గించి వేస్తున్నారు. 10 రోజులు క్రితం వరకు సన్నాలు రకం ధాన్యం 75 కిలోల బస్తా ధర రూ 1,800 ఉంది. ప్రస్తుతం ధరను రూ. 1,600లకు తగ్గించివేశారు. బీపీటీ రకం ధాన్యం ధర దారుణంగా ఉంది. ఈ రకం బస్తా ధాన్యం పల్నాడు జిల్లాలో రూ. 1,300 కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెనాలి ప్రాంతంలో బీపీటీ బస్తా ధాన్యం రూ. 1,440 వ్యాపారులు కొనుగోలు చేశారని రైతులు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మార్కెట్‌లో రైతులకు దక్కడంలేదు. క్వింటా ధాన్యంకు రూ 2,320 మద్దతు ధర ఉంది. అంటే 75 కిలోల బస్తాకు మద్దతు ధర రూ 1,740. మార్కెట్‌లో మద్దతు ధర లభించకపోతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నకరికల్లు మండలం నరసింగపాడు.. త్రిపురాపురం, రాజుపాలెం మండలం నెమలిపూరి, తెనాలి ప్రాంతాల్లో ముమ్మరంగా వరి నూర్పిడులు జరుగుతున్నాయి. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. నేటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మార్కెట్‌లో ధాన్యం అమ్ముకొని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బీపీటి ధాన్యం మద్దతు ధర కన్నా బస్తాకు రూ 440కు తక్కువుగా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణకు ధాన్యం ఎగుమతులు లేని కారణంగా ధర తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. ధర పతనం అయిన సమయంలో పౌరసరఫరా శాఖ రంగంలోకి దిగి రైతులును ఆదుకోవాల్సి ఉంది. ఈ ప్రయత్నాలు జరుగుతున్న దాఖలాలు లేవు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఊసే ఎత్తడంలేదు. నేటి వరకు ఒక్క కేంద్రం కూడా ప్రారంభం కాలేదంటే రైతులు పట్ల నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తోంది. ఇంకా ధాన్యం రాలేదన్న వాదనను అధికారులు వినిపిస్తున్నారు. తెనాలి ప్రాంతంలో గత రెండు రోజుల్లో వ్యాపారులు దాదాపు 10 లారీల ధాన్యం కొనుగోలు చేశారు. పల్నాడు జిల్లాలో కూడా కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇవేవి పౌరసరఫరాల శాఖకు కనిపించకపోవడం గమనార్హం. గిట్టు బాటు ధర మాట ఎలా ఉన్నా కనీసం మద్దతు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

'పెమ్మసాని' జోక్యంతో సీసీఐలో కదలిక

- జనరల్ మేనేజర్‌పై కేంద్రానికి ఫిర్యాదు చేసిన మంత్రి
- పత్తి కొనుగోళ్ల పర్యవేక్షణకు సీనియర్ అధికారి నియామకం

గుంటూరు సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇన్ని రోజులు పత్తి కొనుగోలు ప్రక్రియలో ఏర్పడిన ప్రతిష్టంభనకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో తెరపడింది. పెమ్మసాని జోక్యంతో కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌లో పత్తి కొనుగోలు వ్యవహారం లో జరుగుతున్న తాత్సారంపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో పత్తి కొనుగోలు ప్రక్రియను ప్రత్యేకంగా పర్యవేక్షించేందుకు సీసీఐలోని సీనియర్ అధికారిని నియమించారు. గుంటూరు నగర పరిధిలోని సీసీఐ కేంద్రాలను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం సందర్శించారు. ఆ సందర్భంగా పత్తి అమ్మకాల విషయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు రైతులు మంత్రి దగ్గర ఆవేదన చెందారు. పత్తి కొనుగోలుపై గుంటూరు సీసీఐ జనరల్ మేనేజర్ నిరాసక్తత ప్రదర్శిస్తున్నారని, తమను ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడుతున్నారని రైతులు ఈ సందర్భంగా పెమ్మసాని దృష్టికి తీసుకువెళ్లారు. ఆంధ్రాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్, సీసీఐ సీఎండీ గుప్తా దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కేంద్ర ప్రభుత్వం సీసీఐ సీనియర్ అధికారిని రంగంలోకి దింపింది. పత్తి కొనుగోళ్లకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. పత్తి కొనుగోళ్లను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేయగా, పూర్తిస్థాయిలో కొనుగోలు ప్రారంభిస్తామని రైతులకు భరోసా ఇచ్చింది. పత్తి కొనుగోలు వ్యవహారంలో మంత్రి పెమ్మసాని చూపించిన చొరవపై రైతుల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

మిస్టరీగా బాలుడి మృతి


- ఈతకు వెళ్లి బావిలో మృతి
- పోలీసులకు ఫిర్యాదు ఇవ్వని బంధువులు
- ఆలస్యంగా వెలుగులోకి

తాడికొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు మృతి మిస్టరీగా మారింది. గ్రామస్తులు తెలియజేసిన వివరాల ప్రకారం.. 9వ తరగతి చదువుతున్న షేక్ సమీర్‌కు తల్లిదండ్రులు చనిపోవటంతో తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలోని నాయనమ్మ, మేనమామ ఇంటి వద్ద ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. అక్టోబరు 24న పాఠశాలకు వెళ్లకుండా సమీర్ ఇంటి వద్దనే ఉన్నాడు. అయితే అదే రోజు మధ్యాహ్నం పాఠశాలలో విద్యార్థులకు డ్రిల్ పిరియడ్ నిర్వహించారు. కొంతమంది విద్యార్థులు డ్రిల్ పిరియడ్‌ను మానేసి ఈత కొట్టడానికి గ్రామ పొలిమేరలో ఉన్న బావి వద్దకు వెళ్తూ సమీర్‌ను తీసుకువెళ్లారు. ఈత కొట్టే క్రమంలో సమీర్ బావిలోని బురదలో ఇరుక్కుపోయాడు. సమీర్ ఎంతసేపటికి పైకి రాకపోవటంతో విద్యార్థులు భయంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. సమీర్ బావిలో పడిపోయాడు అనే విషయం గ్రామస్తులు, బంధువుల దృష్టికి రావటంతో బావి వద్దకు చేరుకుని గాలించారు. ఎంతసేపటికి జాడ తెలియకపోవడంతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని బావిలోకి గాలం వేసి వెతికారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవటంతో బావిలో నీటిని ఇంజన్లతో బయటకు తోడి సమీర్ మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పోలీసులు, గ్రామస్తులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తీసుకువెళ్లమని చెప్పినప్పటికీ బంధువులు ఒప్పుకోకపోవటంతో బాలుడి స్వగ్రామం అమరావతి మండలం కర్లపూడికి తరలించారు.

బంధువుల ఆరోపణలు..

సమీర్ శరీరంపై రక్తపు గాయాలు ఉన్నాయని, తోటి విద్యార్థులు విచక్షణా రహితంగా కొట్టి బావిలో పడేశారని బంధువులు ఆరోపిస్తున్నారు. విషయాన్ని ఆ గ్రామ సర్పంచి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం మస్తాన్‌బీతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయించారు. అయితే విచారణ ఏవిధంగా సాగిందో లేదో తెలియని పరిస్థితి. బాలుడు మృతిపై విచారణ చేయటానికి జిల్లా ఉప విద్యాధికారి వెంకటేశ్వరావు సోమవారం పొన్నెకల్లు జిల్లా పరిషత్ పాఠశాలకు వచ్చారు. బాలుడు మృతిపై సమగ్ర విచారణ చేపట్టి డీఈవోకు నివేదికలు అందజేస్తానని తెలిపారు. బాలుడు మృతిపై తాడికొండ సీఐ కె.వాసును వివరణ కోరగా సమీర్ మృతి చెందిన రోజు పోస్టుమార్టంకు తీసుకువెళ్తామని చెప్పినప్పటికీ బంధువులు ఒప్పుకోలేదని తెలిపారు. కనీసం ఫిర్యాదు కూడా ఇవ్వలేదన్నారు. సోమవారం ఉన్నధికారులు బంధువుల వద్ద నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసి ఫిర్యాదు తీసుకోవాలని ఆదేశించగా వారి వద్దకు వెళ్లి బాలుడు మృతిపై ఫిర్యాదు ఇవ్వాలని కోరాగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని చెప్పారు. దీంతో సమీర్ మృతి మిస్టరీగా మారింది.

గల్లంతైన సత్యనారాయణ మృతదేహం లభ్యం



సత్యనారాయణ (ఫైల్)

రెంటచింతల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిలో గల్లంతైన మిర్చి వ్యాపారి నీలా సత్యనారాయణ (62) మృతదేహం సోమవారం లభ్యమైనట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. తుమృకోటకు చెందిన నీలా సత్యనారాయణ, పద్మావతి దంపతులు రెంటచింతలలో కొంతకాలం నుంచి నివాసముంటున్నారు. ఈ నెల 16న నదిలో కార్తీక స్నానమాచరించే క్రమంలో భార్య పద్మావతి నీళ్లలోకి జారిపోతున్న క్రమంలో రక్షించడానికి భర్త సత్యనారాయణ తీవ్రంగా ప్రయత్నించి గల్లంతైయ్యాడు. భార్య పద్మావతి మృతదేహం లభ్యంకాగా, సత్యనారాయణ మృతదేహం కోసం గాలిస్తుండగా, సోమవారం లభ్యమైంది. భార్యభర్తలకు పోస్టుమార్టం నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే బ్రహ్మరెడ్డి వినతితో..

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి వినతికి టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఎస్‌ఈ కె.వెంకటరమణ, శ్రీశైలం చీఫ్ ఇంజనీర్ కాంతారావు సానుకూలంగా స్పందించారు. ఆదివారం రాత్రి 10 గంటల 10 నిమిషాల నుంచి రెండు టర్బయిన్ల నుంచి విద్యుదుత్పత్తిని నిలిపి వేయడం వలన నదిలోకి వెళ్లే 8800 క్యూసెక్కుల నీరు నిలిచిపోయింది. దీంతో నదిలో ప్రవాహ వేగం తగ్గడం వలన సోమవారం సత్యనారాయణ మృతదేహం లభ్యమైంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

అమరావతి, నవంబరు 18: మండల పరిధిలోని దిడుగు గ్రామ సమీపంలో ద్విచక్రవాహనంపై అమరావతి వైపు వస్తున్న అచ్చంపేట మండలం కొండూరుకు చెందిన కుంభా శ్రీనివాసరావు(45)ను గుర్తుతెలియని వాహనం సోమవారం ఢీకుంది. ఆయన చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులు ఆర్టీసీ బస్సు ఢీకొనడం వలనే శ్రీనివాసరావు మృతి చెందాడని ఆరోపిస్తున్నారు. అమరావతి వైపు నుంచి వస్తున్న శ్రీనివాసరావు వాహనానికి వెనుక వైపు నుంచి వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైయ్యాయి. వెంటనే అతన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి ద ర్యాప్తు చే స్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భారీగా డీఎల్‌డీవోల బదిలీలు

గుంటూరు సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెద్ద ఎత్తున డీఎల్‌డీవోల (డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) బదిలీలు జరిగాయి. సోమవారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో విడుదల చేసింది. ప్రకాశం జిల్లా కందుకూరు డీఎల్‌డీవో కె.శ్రీదేవిని తెనాలిలో నియమించారు. డీఎల్‌డీవో సి.హనుమంతరావును డ్వామా పీడీ కార్యాలయంలో నియమించారు. డీఎల్‌డీవో డి. వెంకట్రావును బాపట్ల ఈటీసీ ప్రిన్సిపాల్‌గా నియమించారు. తెనాలి డీఎల్‌డీవో పి. పద్మజను బాపట్ల ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. ప్రకాశం జిల్లా డ్వామా పీడీ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న సీహెచ్ విజయలక్ష్మిని బాపట్ల డీఎల్ డీఓ గా నియమించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

విజ్ఞాన్ యూనివర్సిటీలో వైభవంగా 'ఉద్భవ్ 2కే24'



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ సుశీల్ కుమార్

గుంటూరు(విద్య), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ 'ఉద్భవ్ -2కే24' వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని క్రైజెన్(కీ టు ఆంబీషియస్ అండ్ ఇంటెలెక్చుయల్ జోన్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ నోవల్టీ)స్కూల్ ఆఫ్ లా అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి విశాఖపట్నంలోని ఐఐఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ సాంకేతిక అంతరాయాలు, ప్రపంచీకరణ, మారుతున్న సామాజిక అంచనాల కారణంగా నిర్వహణ రంగం ఎలా అభివృద్ధి చెందుతుందో చర్చించారు. నేటి డైనమిక్ వ్యాపార వాతావరణంలో నిరంతర అభ్యాసం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. మరో ముఖ్య అతిథి హైదరాబాద్‌లోని మైక్రో ల్యాబ్స్ లిమిటెడ్ సేల్స్ మేనేజర్ వీసీ. మరళీ క్రిష్ణ రాజ్ మాట్లాడుతూ కార్పొరేట్ ప్రపంచంలో తన వ్యక్తిగత ప్రయాణాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. హైదరాబాద్‌లోని డ్రీమ్‌ప్లగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్, పూర్వ విద్యార్థి రాఘవేంద్ర పొన్నగంటి మాట్లాడుతూ ఇన్నోవేషన్, ఎంట్రప్రెన్యూర్‌షిప్, నెట్‌వర్కింగ్ విషయాలను వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లుకు తక్షణమే కనీస వేతనం అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షు డు వై నేతాజీ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాల ని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లు నిర సన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆందోళనల సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన జీవోలను విడుదల చేయాలన్నారు. యూనియన్ అధ్యక్షురాలు ధనలక్ష్మి సమస్యలు పరిష్కరించని నేపథ్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అనం తరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసనల్లో దండా లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, జ్యోతి, వాణీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర బాల కుటీర్‌లో లలిత కళా ఉత్సవ పోటీలు

గుంటూరు(విద్య), నవంబరు 18(ఆంధ్ర జ్యోతి): స్థానిక శ్యామలనగర్‌లోని శ్రీవెంకటేశ్వ ర బాల కుటీర్‌లో సోమవారం లలిత కళా ఉ త్సవ పోటీలు ఘనంగా ప్రారంభమైనట్లు సంస్థ వ్యవస్థాపకురాలు ఎన్.మంగాదేవి వెల్లడిం చారు. విద్యార్థులకు ఉదయం కవిత, కథ, లేఖా రచన పోటీలు, మధ్యాహ్నం చిత్రలేఖన పోటీ లు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తం గా పలు జిల్లాలోని పాఠశాలల నుంచి విద్యార్థు లు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. విద్య అంటే పుస్తక పరిజ్ఞానం ఒకటే కాదని కళలు కూడా అందులో ఒక భాగమేనని డాక్టర్ మంగాదేవి అన్నారు. విజేతలకు డిసెంబరు 10న జరిగే 27వ లలిత కళా ఉత్సవంలో బహు మతుల ప్రదానం ఉంటుందని తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలి : జంగాల

గుంటూరు(తూర్పు), నవంబరు 18(ఆంధ్ర జ్యోతి): ఎన్నికల ప్రచార సమయంలో పట్ట ణాల్లో 2, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీను నెరవేర్చాలని సీపీ ఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం వార్డు సచివాల యాల అధికారులకు వినతిపత్రం ఇచ్చే కార్యక్ర మం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జంగాల చైతన్య, కట్టా శ్రీనివాస్, కోటా మాలాద్రి, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూలీ రేట్ల పెంపు జీవోను విడుదల చేయాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 18(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలోని సివిల్ సప్లయిస్ కార్మికుల కూలీ రేట్ల పెంపు జీవోని తక్షణమే విడుదల చేయాలని లేనిపక్షంలో ఈ నెల 20 తర్వాత పూర్తిస్థాయి సమ్మెలోకి వెళ్తామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ (ముఠా)వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు హెచ్చరించారు. స్థానిక జిల్లా పౌరసరఫరాల సంస్థ కార్యాలయం ఎదుట సోమవారం నిర సన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడు తూ కూలీ రేట్ల అగ్రిమెంట్ కాలపరిమితి ముగిసి 11 నెలలు పూర్తయినా ఇప్పటివరకు జీవోని విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. నిరసనల్లో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు, కోట్ల మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధులను నయం చేయవచ్చు

గుంటూరు మెడికల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మూర్ఛ వ్యాధిగ్రస్తులపై సమాజం వివక్ష చూపకూడదని, అన్ని ఇతర జబ్బుల్లాగా దీనిని మందులతో నయం చేయవచ్చని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్, న్యూరాలజీ ప్రొఫెసర్ ఎన్‌వీ సుందరాచారీ తెలిపారు. వరల్డ్ ఎపి లెప్సీ డే సందర్భంగా సోమవారం ప్రభుత్వ సమగ్రాస్పత్రి న్యూరాలజీ విభాగంలో జరిగిన మూర్ఛ వ్యాదుల అవగాహన సభలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ యూ అరుణకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జీ బిందునర్మద, డాక్టర్ భార్గవీదేవి, న్యూరోసర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ వెటర్నరీ కౌన్సిల్ సభ్యుడిగా పీవీ లక్ష్మయ్య



డాక్టర్ పీవీ లక్ష్మయ్య

గుంటూరు మెడికల్, నవంబరు 17(ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ కౌన్సిల్ సభ్యుడుగా డాక్టర్ పీవీ లక్ష్మయ్యను నామినేట్ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ నెలకొల్పి సివిల్ సర్వీసులకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఆయన శిక్షణ ఇస్తున్నారు. ఆంత్రోపాలజీ స్పెషలిస్టు అయిన లక్ష్మయ్య.. డిగ్రీ స్థాయి నుంచే విద్యార్థులకు సివిల్ సర్వీస్‌లో శిక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ డి గ్రీ ప్రోగ్రామ్‌కు రూపకల్పన చేశారు.

బైక్ రేసర్లపై కఠిన చర్యలు చేపట్టండి

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న బైక్ రైసర్లపై పోలీసు అధికారులు ఉక్కు పాదం మోపాలని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు కోరారు. సోమవారం వారు నగర ట్రాఫిక్ డీఎస్పీ రమేష్‌ను కలసి నగరంలో బైక్ రేసర్‌ల ఆగడాలపై ఫిర్యాదు చేసారు. ముఖ్యం గా విద్యానగర్, రింగ్ రోడ్డు, లక్ష్మీపురం, రాజేంద్రనగర్, బృందావనగార్డెన్స్, జేకేసీ కాలేజీ రోడ్డు తదితర ప్రాంతాల్లో రేసర్లు భారీ సైరన్లను మోగీస్తూ అతి వేగంగాస్నేక్ డ్రైవింగ్ చేస్తూ ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తు న్నారని అన్నారు. ఇటీవల సిదార్థనగర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి అదృష్టవశాత్తు ప్రాణాలతో బతికి బయట పడ్డాడని తెలిపారు. రేసర్ల వాహనాలు సీజ్ చేయటంతో పాటు ర్యాష్ అండ్ రెక్లెస్ డ్రైవింగ్ చేస్తున్నారని ఆర్‌టీఓ కార్యాలయానికి రాసి కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

అర్జీలపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

● ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 154 అర్జీలు

● పరిష్కరించాలంటూ ఆదేశాలు



విభిన్న ప్రతిభా వంతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు(తూర్పు), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న అర్జీల పరిష్కార అంశాన్ని తేలికగా భావించవద్దని వాటిపై ఆలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి స్పష్టం చేశా రు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 154 అర్జీలు వచ్చాయి. జేసీ ఏ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్లు ఎం గంగరాజు, లక్ష్మీ కుమారి, ఆర్డీవో కే శ్రీనివాసరావుతో కలసి ఆమె అర్జీలను స్వీక రించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ అర్జీల పై సంబంధిత శాఖ అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుం దని స్పష్టం చేశారు. సీఎంవో నుంచి వస్తున్న అర్జీలపై ప్రత్యే క శ్రద్ధ చూపాలన్నారు. జేసీ మాట్లాడుతూ పిటిషన్లు సకా లంలో పరిష్కరించకుండా బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళితే సంబంధిత అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ. జిల్లా వ్యవసా య అధికారి ఎస్ వెంకటేశ్వర్లు, గ్రౌండ్ వాటర్ డీడీ వంద నం, హార్టీ కల్చర్ డీడీ రవీంద్ర, మత్స్యశాఖ ఏడీ గాలిదేము డు, డీఎస్‌వో కోమలి పద్మ, మార్కెటింగ్ ఏడీ రాజాబాబు పాల్గొన్నారు.

● మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా మార్చాలని, అంగన్‌వాడీ హెల్పర్లకు పదోన్నతి కల్పించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీ యూ) ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు.

● 108 సేవలను ప్రభుత్వమే నిర్వహించి, ఉద్యోగ భద్రత కల్పించాలని 108 యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు వై శివశంకర్, ఎస్కే బాబు, ఏ రామకృష్ణ తదితరులు అర్జీ అంద జేశారు.

● స్థానిక దాసరిపాలెం వద్ద ఇంటి స్థలం ఇప్పిస్తానని చెప్పి కొరిటిపాడుకు చెందిన షేక్ జాకీర్ అనే మహిళ రూ.4 లక్షలు తీసుకుని మోసం చేసిందని చౌడవరానికి చెందిన సోమరౌతు కన్యాకుమారి ఫిర్యాదు చేశారు.

విభిన్న ప్రతిభావంతులకు బ్యాటరీ వాహనాలకు చర్యలు

కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్య లు విన్నవించుకునేందుకు విభిన్న ప్రతిభావంతులు కలెక్టరేట్‌కు భారీగా చేరుకున్నారు. కలెక్టర్ వారి వద్దకు వెళ్లి వినతిపత్రం తీసుకుని సమస్యలను అడిగి తెలుసు కున్నారు. పదేళ్ల నుంచి విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్స్, బ్యాటరీ వాహనాలు, వినికిడి యంత్రాలు, ఇతర పరి కరాలు అందడం లేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. డిసెంబరు 3న జరిగే దివ్యాంగుల దినో త్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. ఆమె మాట్లా డుతూ విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల జిల్లా ఏడీ సువార్త, విభి న్న ప్రతిభావంతుల ఆదరణ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు వెలుగు శివప్రసాదు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణాలను పురోగతిలోకి తీసుకురావాలి

జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద నిర్మా ణం జరుగుతున్న పేదల ఇళ్లను పురోగతిలోకి తీసుకురా వాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టరేట్ నుంచి వివిధ అంశాలపై మండల, డివిజన్ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమా వేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో హౌసింగ్ లేఅ వుట్లలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ప్రతివారం ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగుల తో లేఅవుట్ల వారీగా సమీక్ష నిర్వ హించి అవసరమైన చర్యలు తీసుకో వాలన్నారు. బ్యాంకు అకౌంట్ల ఈకేవైసీకి సంబంధించి సర్వే, గృహాల జియో ట్యాగింగ్ నవంబరు 22వ తేదీ నాటికి పూర్తయ్యేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు నిరంతరం పర్య వేక్షణ చేస్తూ చర్యలు తీసు కోవాలన్నారు. సమావేశంలో సీపీవో శేషశ్రీ, హౌసింగ్ పీడీ ప్రసాదు, డీపీవో సాయికుమార్, డ్వామా పీడీ శంకర్, డీఈవో రేణుకా, ఉద్యానశాఖ అధికారి రవీంద్ర బాబు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్‌లు ఏర్పాటు చేస్తాం

● అసత్య ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు

● కమిషనర్ పులి శ్రీనివాసులు



వీధి వ్యాపారుల దరఖాస్తులకు ఎక్నాలెజ్‌మెంట్ అందజేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేష న్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరపా లక సంస్థ పరిధిలో వీధి వ్యాపారులకు డిసెంబరు 10 నాటికి వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తామ ని, జీఎంసీ వీధి వ్యాపా రుల సంక్షేమం కోసం చేపడుతున్న పనులపై అసత్య, నిరాధార ఆరోపణలు ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసు లు స్పష్టం చేశారు. సోమవారం జీఎంసీ ప్రధాన కార్యాలయంలో వెండింగ్ జోన్లు, రోడ్ల విస్త రణ, ఆక్రమణల తొలగింపు, శంకర్‌విలాస్ ఆర్‌వోబీ, తాగునీటి సరఫరా అంశాలపై జీఎంసీ చేపడుతున్న చర్యలపై కమిషనర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజనరీ కల్గిన ముఖ్యమంత్రి నేతృత్వంలో గుంటూరు నగరాన్ని సుం దర, స్వచ్ఛ నగరంగా, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. నగర ప్రధాన రహదారులపై ఆవులు తిరగడం వల్ల ట్రాఫిక్‌కి తీవ్ర ఆటంకం, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్ల మీద అనధికారికంగా వదిలిన ఆవులను జీఎంసీ గోశాలకు తరలిస్తున్నామన్నారు.

శంకర్ విలాస్ వంతెన పనులు ప్రారంభమైతే నగరంలో సుమారు 1 నుంచి 2 ఏళ్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రధానంగా రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు అత్యావశ్యకమన్నారు. ఇప్పటికే అమరావతి రోడ్, ఓల్డ్ క్లబ్ రోడ్ ఆక్రమణల తొలగింపు చేపట్టామని, గుజ్జనగుండ్ల నుంచి లాడ్జి సెంటర్ వరకు డ్రైన్, ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు సోమవారం నుంచి ప్రారంభించామని తెలిపారు. నగరంలో ప్రస్తుతం తాగునీటి పైప్ లైన్లు చాలా ప్రాంతాల్లో పాతవి అవ్వడం వల్ల సరఫరా లో సమస్యలు వస్తున్నాయని, అమృత్, ఏఐబీ ద్వారా రాబోవు 50 ఏళ్ల ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.

సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ కమిషనర్

గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న ఆర్జీలను సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 25 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్ష ణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలన్నారు.

● సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 34 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణా ళిక విభాగం 13, ఇంజనీరింగ్ విభాగం 8, రెవెన్యూ విభాగం 5, ప్రజారోగ్య విభాగం 2, అకౌంట్స్ విభాగంకి సంబంధించి 5, ఉపా సెల్ కి సంబంధించి 1 ఫిర్యాదు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంవోహెచ్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

● వీధి వ్యాపారుల గుర్తింపు కార్డుల కోసం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, బృందా వన్ గార్డెన్స్‌లోని సర్కిల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో వారం రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని, గుర్తింపు కార్డులు కల్గిన వారికి త్వరలో ఏర్పాటు చేయబోయే వెండింగ్ జోన్లలో కేటాయింపులు చేస్తామని కమిషనర్ తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన దరఖాస్తు సెంటర్‌ని ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి వ్యాపారులను గుర్తించి, వారికి వెండింగ్ జోన్లలో స్థల కేటాయింపు కోసం దరఖాస్తులు తీసుకుంటున్నా మన్నారు. అనంతరం దరఖాస్తు చేసిన వీధి వ్యాపారులకు ఎక్నాలెడ్జ్‌మెంట్ అందించారు.

● గుంటూరు నగరంలో హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, ఎస్సీపీఐ సర్వేకి ఇంటి వద్దకు వచ్చే సచివాలయ కార్యదర్శులకు నగర ప్రజలు తగిన సమాచారం ఇచ్చి సహకరించాలని కమిషనర్ ఒక ప్రకటనలో కోరారు. నోడల్ అధికారులు ఆయా యాప్‌లను డౌన్‌లోన్ చేసుకొని, క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. నిర్దేశిత గడువు మేరకు సర్వే పూర్తి కావడానికి బాధ్యత తీసు కోవాలన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాం

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని ప్రాంతాల్లో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యతని భారత్ వికాస్ పరిషత్ తీసుకొన్నదని ఆ సంస్థ నాయకులు తెలిపారు. దక్షిణ భారత రీజియన్ భారత్ కో జానో క్విజ్ పోటీలను కొద్ది రోజుల నుంచి బీవీపీ అమరావతి రోడ్డులోని హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తోంది. సోమవారం పోటీల ముగింపు సందర్భంగా బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా కమిషనర్ పులి శ్రీనివాసులు, గౌరవ అతిథి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. బీవీపీ జాతీయ ఉపాధ్యక్షుడు సంపత్‌కుమార్ కురిడియా, అమరావతి ప్రాంత అధ్యక్షుడు రూప్‌చంద్ జైన్, కమల్ నయన్ బంగ్, బైరిశెట్టి మల్లికార్జునరావు, ఎంవీఎస్ రామచంద్రరావు, రాజన్ వలియాతన్, పురుషోత్తం శాస్త్రి, రాజగోపాలమ్ పాయ్, మురళీధర్, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతం కోసం గ్రామ స్థాయిలో నూతన కమిటీలు : అంబటి

గుంటూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతం కోసం జిల్లాలో గ్రామ స్థాయిలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు తెలిపారు. తాడేపల్లిలోని కార్యాలయంలో సోమవారం అంబటి నేతృ త్వంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహిం చారు. పార్టీ బలోపేతం, నూతన కమిటీలపై నేతలతో చర్చించారు. గతంలో ఉన్న జిల్లా, మండల కమిటీలతో పాటు అనుబంధ విభాగాల కమిటీలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కమిటీల స్థానంలో కొత్త కమిటీల నియామకం చేపడతామన్నారు. కాగా జిల్లా కమిటీకి సంబంధించి ప్రతి నియోజకవర్గం నుంచి ఒక ఉపాధ్యక్షుడు, ఇద్దరు ఆర్గనై జింగ్ సెక్రటరీలు, ఇద్దరు ఆక్టివిటీ సెక్రటరీలు, ఒక అధికార ప్రతినిధి పేర్ల ప్రతిపాదనలను నియోజకవర్గ సమన్వయకర్తలు పంపించాలని కోరారు. ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, మురుగుడ హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్తలు అన్నాబత్తుని శివకుమార్, నూరి ఫాతిమా, దొంతిరెడ్డి వేమారెడ్డి, వనమా బాలవజ్రబాబు, బలసాని కిరణ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పాల్గొన్నారు.

పార్కింగ్ సమస్య పరిష్కారం కోసం చర్యలు

● సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో రోగుల ను, వైద్యులను ఇబ్బంది పెడుతున్న మోటారు వాహనాల పార్కింగ్ సమస్యలను పరిష్క రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి సోమ వారం తెలిపారు. ఆస్పత్రికి సంబంధం లేని వాహనాలు లోనికి రాకుండా నిరోధించేందు కు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రోగుల వెంట ఉండే సహా యకులకు రెండు పాస్‌లు అందజేస్తామని, పాసులు ఉన్న వాహనాలను మాత్రమే లోనికి అనుమతిస్తారని ఆయన వివరించారు. దివ్యాంగులు, నడవ లేని రోగులతో వచ్చే ఆటోలు, ఫోర్ వీలర్లు వారిని ఆస్పత్రిలోకి తీసుకెళ్లేం దుకు అనుమతిస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి గుంటూరు జిల్లా కేరాఫ్ కావాలి : కలెక్టర్

గుంటూరు సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అనేక రంగాల్లో అభివృదిధ పథంలో దూసుకుపోతున్న గుంటూరు జిల్లా ప్రకృతి వ్యవసాయానికి కేరాఫ్ కావాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆకాంక్షించారు. ప్రకృతి వ్యవసాయానికి కర దీపికలుగా పేరొందిన రెండు పుస్తకాలను సోమ వారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ పుస్తక సమాచారం వివిధ పంటల సాగులో వచ్చే సందేహాలు తీర్చే విధంగా ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో జేసీ భార్గవ్‌తేజ, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లామేనేజర్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితులు

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే, పోస్టల్, రెవెన్యూ, బ్యాంక్, టీచర్ ఇలా ఏ ప్రభుత్వ ఉద్యోగమైనా చిటికలో ఇప్పించేస్తామంటూ నమ్మించి మోసం చేస్తున్న ఘరానా మోసగాళ్లపై బాధితులు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఇద్దరు బాధితుల నుంచి రూ.ఎనిమిది లక్షలు తీసుకొని వారికి రైల్వేలో టీసీ ఉద్యోగం వచ్చిందంటూ నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్, జాయినింగ్ లెటర్ ఇచ్చి వంచించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని పోస్టల్ కాలనీకి చెం దిన ఓ వ్యక్తి ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. తనకు పరిచయమైన కైకవరపు రవీంద్ర, ఆయన భార్య సరోజ, రవీంద్ర స్నేహితులు ఉదయ్, చిట్టేటి మెర్విన్, వాసుదేవ్ తదితరులు ఓ ముఠాగా ఏర్పడి తాము ఏ ప్రభుత్వ ఉద్యోగమైనా ఇప్పిస్తామని చెప్పార న్నారు. అంతేగాక తాము అనేక మందికి ఉద్యోగాలు ఇప్పించామని నకిలీ అపాయిం ట్మెంట్ ఆర్డర్లు చూపించారన్నారు. అవి నిజమేనని నమ్మిన బాధితుడు తోపాటు మరో మహిళ చెరి నాలుగు లక్షల చొప్పున ఎనిమిది లక్షలు వారికి ఇచ్చారు. ఈ క్రమంలో వాసుదేవ్ అనే వ్యక్తి వీరు ఇంటికి వచ్చి వీరి సర్టిఫికెట్లను, ఆధార్, పాన్ వంటివి తనిఖీ చేశారు. బాధితులతో ఫోటోలు దిగారు. ఆ వెంటనే బాధితులకు రైల్వే అధికారుల సంత కాలు, స్టాంపులు జీవోలతో నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చి నమ్మించి వీరిద్దరి వద్ద 8 లక్షలు కాజేశారు. ఉద్యోగాల పేరుతో అమాయకులను మోసం చేస్తూ, తమ డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్న ఈ ముఠాపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తమ కు న్యాయం చేయాలని బాధితులు ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో వేడుకున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బు తీసుకొని మోసం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై బాధిత యువకు డు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రొంపిచర్ల మండలం మాచవరం గ్రామానికి చెందిన అలికేపల్లి రవీంద్రారెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. ఈ క్రమంలో బ్రాడీపేట 2/10లోని ఓ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో నగరంలోని ఐపీడీ కాలనీకి చెందిన జక్కిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి పరిచయమై తనకు సాఫ్ట్‌వేర్ కంపెనీలో హెచ్‌ఆర్ మేనేజర్లు బాగా తెలుసని, గతంలో అనేక మందికి సాఫ్ట్వేర్ ఉద్యోగాలు ఇప్పించానని నమ్మించాడు. ఈ క్రమంలో గత ఏడాది మే 19న బాధితులు రవీంద్రారెడ్డి నుంచి ఆన్‌లైన్‌లో ఫోన్‌పే ద్వారా ఐదు లక్షల 45 వేలు తీసుకున్నాడు. ఆ తర్వాత రోజులు గడు స్తున్న ఉద్యోగం ఇప్పించకపోవడంతో వారిని బాధితుడు ఒత్తిడి చేయగా దశలవారీగా బాధితుడికి 2 లక్షల 80 వేలు ఇచ్చాడు. మిగిలిన రెండు లక్షల 65 వేలు ఇవ్వాలని అడుగుతుంటే నీవు ఏమి చేసుకుంటావో, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ బెదిరిస్తున్నాడని బాధితులు ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

● రామిరెడ్డి తోట ప్రాంతంలో కొంతకాలంగా వ్యభిచారం మళ్లీ ఊపందుకుందని రామిరెడ్డి తోట 5వ లైన్‌కి చెందిన షేక్ మీరావలి, సాబీర దంపతులు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

● తన ఇంటికి తప్పుడు దస్తావేజులు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై తగు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని శ్రీనివాసరావు తోటకు చెందిన టైలర్ షేక్ హుస్సేన్ ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు.

భార్య,కానిస్టేబుల్ నుంచి తనకు, కుమారుడికి రక్షణ కల్పించండి

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన తండ్రి

గుంటూరు, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగించడమే కాకుండా చివరకు తనను, తన కుమారుడిని చంపుతామని బెదిరిస్తున్న భార్య, ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న కానిస్టేబుల్ నుంచి తమకు రక్షణ కల్పించాలని ఓ తండ్రి సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెదకాకాని మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి 2012లో వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు. అయితే 2019లో భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో భార్య పెదకాకాని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న ఒక కానిస్టేబుల్ ఆమె ఫోన్ నెంబర్ తీసుకొని ఆమెతో మాట్లాడుతూ ట్రాప్ చేశారు. దీంతో భార్యాభర్తలు అప్పటినుంచి దూరంగా ఉంటున్నారు. ఆమె నేరుగా కానిస్టేబుల్ తో సహజీవనం సాగిస్తోంది. దీంతో బాధితులు అప్పట్లో ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో విచారించిన ఎస్పీ సంబంధిత కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. అయినప్పటికీ వారి మధ్య సంబంధం మాత్రం కొనసాగుతూనే ఉంది. అయితే బాధితుడి తన కుమారుడిని నగర శివారు ప్రాంతంలో ఉన్న ఓ గురుకుల పాఠశాలలో చేర్పించారు. కుమారుని చూడాలని ఉందని భార్య ఇటీవల భర్తకు ఫోన్ చేసి కోరడంతో ఆదివారం వెళ్లి చూడమని చెప్పాడు. దీంతో భార్య ఆ కానిస్టేబుల్ కూడా తీసుకొని గురుకుల పాఠశాలకు వెళ్లి కుమారుడని తీసుకొని బయటికి వెళ్ళింది. అదే సమయంలో అక్కడికి వెళ్లిన తండ్రికి హాస్టల్లో కుమారుడు లేడని చెప్పడంతో పాటు వాళ్ల పెదనాన్న వస్తే పంపించామని అక్కడి సెక్యూరిటీ సిబ్బంది చెప్పడంతో బాధితుడు విస్మయానికి గురయ్యారు. తన భార్య ఆ కానిస్టేబుల్ వచ్చి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇదే విషయంపై నల్లపాడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా తన భార్య ఆ కానిస్టేబుల్ కలిసి తనను, తన కుమారుడిని చంపుతామని బెదిరించారని బాధితుడు వాపోయారు. తనకు, తన కుమారుడికి తన భార్య, కానిస్టేబుల్ నుంచి రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

బీఆర్ స్టేడియం అభివృద్ధికి నిధులు కేటాయించాలి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియం అభివృద్ధి కోసం నిధులు కేటాయిం చి ప్రభుత్వం తోడ్పాటును అందించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. ఆరో రోజు సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరులో 1952లో స్థాపించిన బ్రహ్మానందరెడ్డి స్టేడియం శిథిలావస్థకు చేరిందని గతంలో 26ఎకరాలు ఉన్న స్టేడియం ఆక్రమణలకు గురై 18 ఎకరాలకు వచ్చిందని వివరిం చారు. కూటమి ప్రభుత్వం బీఆర్ స్టేడియం అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆయన కోరారు. మున్సిపల్‌శాఖ మంత్రి, మున్సిపల్ సిబ్బంది స్టేడియంపై దృష్టి సారించాలని కోరారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం మరమ్మతులు, అభివృద్ధి కోసం ప్రభుత్వం డీపీఆర్‌లు తయారుచేసి 'ఖేలో ఇండియా' ద్వారా, మున్సిపల్‌శాఖ ద్వారా నిధులు కేటాయిం చాలని రెండు శాఖల మంత్రులను నసీర్ కోరారు.

మాది మైనార్టీల సంక్షేమ ప్రభుత్వం

తమది మైనార్టీల సంక్షేమ ప్రభుత్వమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మైనార్టీలకు బడ్జెట్ కేటాయింపులపై ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. బడ్జెట్లో మైనార్టీల అభ్యు న్నతికై ఘనంగా నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. మైనార్టీలకు రూ.4,300 కోట్లు బడ్జెట్ కేటాయించడం శుభపరిణామమన్నారు. మైనార్టీలకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్కాలర్‌షిప్పులను పునరుద్ధరించాలని కోరారు. నూర్‌బాషా, దూదే కుల కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి వారి అభ్యున్నతికి సహకారం అం దించా లని కోరారు. వైసీపీ వేధింపులకు బలైన అబ్దుల్ సలామ్, హాజిరాబీలాంటివారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని తదితర విషయాలపై విన్నవించారు.

మాదక ద్రవ్యాలుగా దుర్వినియోగమయ్యే మందులను కట్టడి చేయాలి

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



గుంటూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యా లుగా దుర్వినియోగం అవుతున్న మందులను కట్టడి చేయా లని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం ఆమె డ్రగ్స్ ప్రమాదంపై సభలో చర్చకు తెచ్చారు. ఆమె మాట్లాడుతూ దేశంలో డ్రగ్స్ కట్టడి చేయడం పెద్ద సవాలుగా మారిందని, ఎంత కట్టడి చేస్తున్నా వివిధ రూపాల్లో అది యువతకు అందుబాటులో ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశా రు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గంజాయి కట్టడికి కృషి చేస్తున్నా కూడా దానికి బానిసలైన యువత 'కోడైన్ పాస్ఫేట్ సిరప్' అనే డ్రగ్‌ను మత్తుమందుగా ఉపయోగిస్తున్నారని, దానిని కట్టడి చేయాలని కోరారు. కోడైన్ పాస్ఫేట్ అనే డ్రగ్‌పై 2016లోనే కేంద్రం నిషేధం విధించిందని ఆమె సభ దృష్టికి తెచ్చారు. గుంటూరులోని ఒక కాలేజీ ప్రాంగణంలో ఆ మందు సీసాలు కనిపించాయని ఆమె సభలో తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖా మంత్రి దీనిపై దృష్టి పెట్టి, కోడైన్ ఎక్కడ నుంచి లభిస్తుంది, ఫార్మా కంపెనీ, మెడికల్ షాపుల మీద దృష్టి పెట్టి వీటిని అరికట్టాలని కోరారు.

102.9 లక్షలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులకు బాటలు వేస్తున్నామని ఎమ్మెల్యే మాధవి తెలిపారు. గుంటూరు 42వ డివిజన్‌లో కోటీ 2 లక్షల 10వేల రూపాయలతో 10 అభివృద్ధి పనులకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, లంకా ఉదయ్, పాకాలపాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయం : డేగల ప్రభాకర్



మంత్రి టీజీ భరత్‌తో డేగల ప్రభాకర్

గుంటూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను రూపు మాపేందుకు పరిశ్ర మల స్థాపనకు కృషి చేస్తానని ఏపీ పరిశ్రమల అభివృద్ధి కార్పొరే షన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్ ను సోమవారం సచివాలయంలోని ఆయన కార్యక్రమంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం, శాలువతో సన్మా నించారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడుతూ పరి శ్రమల స్థాపన, నిరుద్యోగులకు ఉపాధి కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని డేగలతో చెప్పారు. కాగా నూతన పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు మంత్రి భరత్‌కు డేగల ప్రభాకర్ తెలియజేశారు.

190 క్వింటాళ్ల పత్తి కొనుగోలు



పత్తిని పరిశీలిస్తున్న వినుకొండ ఆంజనేయులు

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు రోడ్డులో ప్రారంభించిన సీసీఐ పత్తి కొనుగోలు కేం ద్రంలో తొలి రోజునే ఐదుగురు రైతుల నుంచి 190 క్వింటాళ్ల పత్తిని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశారని గుంటూరు వ్యవ సాయ మార్కెట్ కమిటీ సెక్రె టరీ వినుకొండ ఆంజనేయు లు తెలిపారు. సోమవారం సీసీఐ నోటిపై చేసిన శ్రీకోటేశ్వర కాటన్ ట్రేడింగ్ కంపెనీలో పత్తి కొనుగోళ్లని మార్కెటింగ్ శాఖ ప్రారంభించింది. సెక్రెటరీ ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో యార్డు గ్రేడ్-1 సెక్రెటరీ సుబ్రహ్మణ్యం, గ్రేడ్-3 సెక్రెటరీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు 156 రైతు సేవా కేంద్రాలు

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పౌరసరఫరాల సంస్థ గుంటూరు మేనేజర్ వై శ్రీలక్ష్మి సోమవారం తెలిపారు. మొత్తం 156 రైతు సేవా కేంద్రాలను 45 క్లస్టర్ పాయింట్‌లుగా ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వం గ్రేడ్-ఏ రకం క్వింటాల్‌కు రూ.2,321, 75 కేజీల బస్తాకు రూ. 1,740, సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,300, 75 కేజీల బస్తా అయితే రూ.1,725గా నిర్ణ యించిందన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించదలచిన రైతు లు సంబంధిత గ్రామ వ్యవసాయాధికారి(వీఏఏ) దగ్గర ధాన్యం కొనుగోలుకు షె డ్యూల్ చేయించుకోవాలని సూచించారు. రైతు తాను పండించిన ధాన్యాన్ని తనకు నచ్చిన బియ్యం బిల్లుకు పంపుకోవచ్చు. అలానే వాట్సాప్ నంబరు 73373 59375 ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా కంట్రోల్ రూం 9491392717కి ఫోన్ చేసి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయాలకు కార్తీక శోభ



అరండల్‌పేట శివాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

గుంటూరు(తూర్పు), నవంబ రు 18(ఆంధ్రజ్యోతి): మూడో కార్తీక సోమవారంను మహిళలు భక్తి శ్రద్ధలలో నిర్వహించారు. పలు శివాలయాలు కార్తీక శోభను సంతరించుకుంది. రవీం ద్ర నగర్, కొత్తపేట, అరండల్ ఎట, బ్రాడీపేట, ఆర్ అగ్రహారం, పాతగుంటూరు తదితర శివాల యాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు.

బీఎల్‌వోలు ఇంటికెళ్లి పరిశీలించాలి : సీఈవో

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కృష్ణా- గుంటూరు, తూర్పు-పశ్చిమ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదయ్యేందుకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి పరిశీలించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ ఆదేశించారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆన్‌లైన్‌లో సమర్పించిన సర్టిఫికెట్ల ఒరిజినల్స్‌ను పరిశీలించాలి. సరిగ్గా ఉన్నాయని తేలితే ఆమోదిస్తున్నట్లు, లేకపోతే తిరస్కరిస్తు న్నట్లు సంతకం చేయాలి. నామినేషన్ల స్వీకరణ గడువుకు పది రోజుల ముందు వరకు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు.





ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్‌గా నియమితులైన మోహనకృష్ణను ఎమ్మెల్యే గళ్లా మాధవి, రామచంద్రరావు దంపతులు, టీడీపీ జోన్- 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా ఆయనను సన్మానించారు. - గుంటూరు (ఆంధ్రజ్యోతి).

ఆయుధాలకు నీరాజనాలు

◆ పల్నాటి వీరుల ఆయుధాలకు ఉత్సవాలు ◆ కారంపూడిలోని యుద్ధభూమిలో ఆయుధ పూజ ◆ 30 నుంచి డిసెంబరు 4 వరకు వీరారాధన ఉత్సవాలు

బ్రహ్మనాయుడి నృసింహకుంతం


బ్రహ్మనాయుడు ఉపయోగించిన ఆయుధం నృసింహకుంతం. దీనిని సామంత రాగోల అని పిలుస్తారు. త్రిశూల ఆకారంలో 64 కోణాలు కలిగి చివర విషపు ములుకులు కలిగి ఉన్న ఈ ఆయుధం విశ్వకర్మ చేత రూపొందించబడి బ్రహ్మనాయుడుకు ఆయుధంగా ఇవ్వబడిందని చరిత్ర చెబుతోంది. చాలా శక్తివంతమైంది. నరసింహస్వామి కొణతంగా పిలుస్తూ వీరారాధనకు విచ్చేసిన ఆచార వంతులు, యాత్రికులు, భక్తి ప్రపత్తులతో కొలుస్తూ కత్తిసేవ చేస్తారు. దీనిని ఉత్సవాల సమయంలో వీర్ల దేవాలయంలో, మిగిలిన సమయంలో చెన్నకేశవ స్వామి ఆలయంలో ఉంచుతారు.





బాలచంద్రుడి సామంత ఆయుధం

పల్నాటి దైవం చెన్నకేశవ స్వామి వరంగా బాలచంద్రుడికి వచ్చిన ఆయుధమే సామంతము. అలరాజును చంపిన నరసింగరాజును బాలచంద్రుడు ఈ సామంతమనే ఆయుధంతో సంహరించి తలను తన తండ్రి బ్రహ్మనాయుడుకు కానుకగా ఇచ్చాడు.



అలరాజు సూర్య భేతాళం


తన తండ్రి కొమ్మరాజు అంకాళమ్మ తల్లిని శిరస్సుపై ధరించి భక్తి ప్రపత్తులతో అమ్మవారిని సేవించగా అంకాళమ్మ వరప్రసాదిత ఖడ్గమే సూర్య భేతాళం. దీన్ని కొమ్మరాజు తన కుమారుడైన అలరాజుకు బహూకరిస్తాడు. ఈ ఆయుధంతో అల రాజు శత్రువులను చీల్చి చెండాడాడు. నాగమ్మ చేసిన విషప్రయోగంతో మరణించే సమయంలో తన ఆయుధమైన సూర్య భేతాళంను బాలచంద్రుడికి ఇవ్వమని కన్నమదాసుకు చెప్పి మరణిస్తాడు అలరాజు.

దేశంలో.. ప్రపంచంలో పురాతన కాలం నుంచి నేటి వరకు ఎన్నో యుద్ధాలు జరిగాయి. విషాదాలు మిగిల్చాయి.. మరుగనపడిపోయాయి. కానీ ఎప్పుడో ఎనిమిది వందల నలభై సంవత్సరాల క్రితం జరిగిన యుద్ధం ఆనవాళ్లు ప్రజల మది నుంచి తొలగలేదు. నాడు యుద్ధంలో వీరులు ఉపయోగించిన ఆయుధాలు పరమ పూజ్యనీయమై నీరాజనాలు అందుకుంటున్నాయి. అదే పల్నాడు ప్రత్యేకత. ఆధిపత్యం.. అధికార దాహం.. పదవీ వ్యామోహాలతో పల్నాడులో 12వ శతాబ్దంలో జరిగిన యుద్ధం చరిత్రగా కాలగర్భంలో కలిసిపోకుండా వీరారాధన ఉత్సవాల పేరుతో ఏటా కార్తీక మాసంలో జరుగుతుంది. పల్నాడులో కత్తులు నర్తిస్తాయి. నాటి వీరుల గాథలను భక్తులు ఆలపిస్తుంటారు. 14 జిల్లాల్లోని వీరాచారవంతులు ఈ ఆయుధాలే కాక తమ పూర్వీకుల ఆయుధాలతో వీర్ల దేవాలయం వద్ద ఉన్న యుద్ధ భూమికి తీసుకొచ్చి పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పిస్తారు. 15న వీరారాధన ఉత్సవాలకు అంకురార్పరణ జరిగింది. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం నాటి ఆయుధాలు.. వాటి నేపథ్యం.

కారంపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 12వ శతాబ్దం చివరలో కారంపూడిలో జరిగిన పల్నాటి యుద్ధానికి ఓ ప్రత్యేకత ఉంది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఆనాటి పల్నాటి యుద్ధంలో వీరులు ఉపయోగించిన ఆయుధాలు పరమపూజ్యనీయమై నీరాజనాలు అందుకుంటున్నాయి. శైవ, వైష్ణవి సంఘర్షణ, పగా ప్రతీకారం, పదవీ వ్యామోహం నేపథ్యంలో 1184వ సంవత్సరంలో జరిగిన పల్నాటి యుద్ధంలో స్త్రీశక్తి ఎంత ప్రభలమైనదో నిరూపించింది. సర్వమత సమానత్వాన్ని, కుల, మత, వర్ణ రహిత సమాజాన్ని ప్రబోధించే మహోన్నత చాపకూడు సిద్ధాంతాన్ని ఆవిష్కరించింది. ఈ నెల కార్తీక అమావాస్య 30వ తేదీ నుంచి డిసెంబరు 4 వరకు ఐదు రోజులపాటు కారంపూడిలో వీరారాధన ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్తీక పౌర్ణమి రోజైన శుక్రవారం రాత్రి పల్నాటి వీరారాధన ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. పల్నాటి యుద్ధంలో అమరులైన వీరుల కుటుంబాలకు తమ పూర్వీకుల ఆయుధాలతో ఉత్సవాలకు తరలిరావాలని లేఖలు పంపారు.

విష్ణు ముద్రిత శరాయుధం

విశేష దివ్య శక్తులు కలిగిన కొమ్మరాజు తన చేతిలో ఈ ఆయుధం ఉన్నంత వరకు ఓటమి ఎరుగడు. ఇతని ప్రధాన ఆయుధం విష్ణు ముద్రిత శరాయుధం. బాణం, బల్లె, కత్తిని సమర్థవంతంగా వాడగలిగిన అస్త్రశస్త్ర విశారదుడు కొమ్మరాజు.





పెద్దన్న బాదరాజు ముద్గరం

బ్రహ్మనాయుడు సోదరుడైన పెద్దన్న బాదరాజు ఉపయోగించిన ఆయుధం ముద్గరం. అశ్వముల కారణంగా అనుకోని విధంగా అలరాజుకు పెద్దన్న బాదరాజుకు జరిగిన పోరాటంలో బాదరాజు వాడిన ఆయుధం ముద్గరం.

నాయకురాలు నాగమ్మ వీరఖడ్గం

గురజాల రాజ్యానికి మంత్రిగా నియమితులైన నాయకురాలు నాగమ్మ తన వీరఖడ్గం శివుని ప్రసాదంగా భావిస్తారు. ఆది నుంచి శివ భక్తురాలైన నాగమ్మ ఈ ఆయుధాన్ని యుద్ధంలో ఉపయోగించి పల్నాటి సైన్యాన్ని నేలకొరిగించింది.



కన్నమదాసు భైరవఖడ్గం

బ్రహ్మనాయుడుకు మానస పుత్రుడు, పల్నాటి రాజ్య సర్వ సైన్యాధిపతి అయిన మాల కన్నమదాసు ఉపయోగించిన ఆయుధం భైరవఖడ్గం. భైరవ పోతురాజుల శక్తితో ఉద్భవించిన ఆయుధంగా భైరవఖడ్గం పేరుతో విరాజిల్లింది. ఇది దాదాపు నాలుగు అడుగుల పొడవు, ఆరు అంగుళాల వెడల్పుతో ఒంటి చేత్తో మోయడానికి వీలు లేని విధంగా ఉంటుంది. ఈ ఆయుధంతోనే కన్నమదాసు మండాది అడవుల్లో అరణ్యవాసం చేస్తున్నప్పుడు తమ గోవులను తరలించుకుపోతున్న శత్రుమూకలను చీల్చిచెండాడారు. పల్నాటి యుద్ధంలో ఈ ఖడ్గంతో ఒక వేటుతో ఆరు తలలు నరికినట్లు చరిత్ర చెబుతోంది.





మలిదేవరాజు నామాల ఆయుధం

మాచర్ల రాజ్యాధిపతి మలిదేవరాజు నామాల ఆయుధంను తరచూ ఉపయోగిస్తారు. యుద్ధ సమయంలో ఆ ఆయుధంతోనే గురజాల సైన్యాన్ని ఎదురించారు. ఇప్పటికీ ఈ ఆయుధం స్థానిక వీర్ల దేవాలయంలో వీరాచారవంతుల పూజలు అందుకుంటుంది.

పల్నాటి యుద్ధం అనంతరం నాగులేటి ఒడ్డున ఔరంగజేబు సైనికులు జాఫర్, పరీద్‌లు నిర్మించిన వీర్ల దేవాలయంలో భద్రపరిచిన ఆయుధాలు పూజలందుకుంటున్నాయి. ఆలయంలో ఆయుధాలు భద్రపరిచిన సైనికులు తామూ వీరులుగా ఆలయ ఆవరణలో జీవ సమాధులయ్యారు. ఈ సమాధులు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి.



వీర్ల దేవాలయం

కోటప్పకొండలో.. భక్తుల సందడి






కుంకుమతో..



త్రికోటేశ్వర స్వామికి విశేష అలంకారం



గంధంతో..



విభూధితో..

త్రికోటేశ్వర స్వామికి వైభవంగా రుద్రాభిషేకం

త్రికోటేశ్వర స్వామికి పసుపుతో అభిషేకం

నరసరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండలో కార్తీక సోమవారం పురస్కరించుకుని శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూప శ్రీ త్రికోటేశ్వర స్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలంకరణ సేవ జరిగింది. తెల్లవారు జామునుంచే వేలాదిగా భక్తులు కొండకు తరలివచ్చి శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ప్రాంగణంలో.. నందీశ్వరుని విగ్రహం వద్ద పెద్ద ఎత్తున భక్తులు దీపారాధనలు చేశారు. ఆలయ ఈవో డీ చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసి నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ప్రత్యేక సర్వీసులు కొండకు నడిపింది. పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది.

పైసలిస్తేనే.. పీఎఫ్ రుణం

(5వ పేజీ తరువాయి)

పాఠశాలల ఉపాధ్యాయుల రుణాలు ఈ విభాగంలో, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల రుణాలు ఎఫ్ విభాగం పర్యవేక్షిస్తుంది. ఇందులో పనిచేసే సిబ్బంది రుణాలు కోసం వచ్చిన దరఖాస్తుల్ని నిబంధనల ప్రకారం క్లియర్ చేయాల్సి ఉండగా కొర్రీలు పెట్టి పక్కనపడేస్తున్నారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు రూ. 5లక్షలకు మించి రుణం కోసం దరఖాస్తు చేస్తే సివిల్ అసిస్టెంట్ సర్జన్ నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకురావాలని నిబంధన పెట్టారు. ఈసర్టిఫికెట్ రుణం కోసం చేసిన దరఖాస్తుకు జత చేయకపోవడం వల్ల మీ రుణం ప్రాసెస్ చేయడం లేదని కొంతమంది సిబ్బంది ఉపాధ్యాయులకు ఫోన్లు చేసి చెబుతున్నారు. ఉపాధ్యాయులు హడావుడిగా కార్యాలయానికి వెళ్తే అక్కడ పర్సంటేజీలు మాట్లాడుకుని బేరాలకు దిగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

- జడ్పీలో పనిచేసే ఓ ద్వితీయశ్రేణి అధికారి పేరుతో పీఎఫ్ రుణాల పర్సంటేజీల దందా సాగుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఆయన పేరు చెప్పి సిబ్బంది ఉపాధ్యాయుల నుంచి పర్సంటేజీల వారీగా అందినకాడికి దండుకుంటున్నారు.
- ఉపాధ్యాయులు మరణిస్తే ఆయన తాలుకా వచ్చే బెనిఫిట్స్ కోసం కుటుంబ సభ్యులతో జడ్పీ సిబ్బంది బేరాలు ఆడుతున్నారు. డెత్‌క్లయిమ్ క్లియర్ చేసి వచ్చే మొత్తాలు వారసులు తీసుకోవాలంటే రూ. 5వేల నుంచి రూ. 10వేల వరకు పర్సంటేజీలు ఇవ్వాల్సి వస్తోందనే ఆరోపణలు ఉపాధ్యాయ కుటుంబాల నుంచి వస్తున్నాయి.
- జడ్పీలో ఉపాధ్యాయులు పీఎఫ్ అకౌంట్లు అప్‌డేట్ చేయడం లేదు. ఫలితంగా తాము జీతం నుంచి చెల్లించిన డబ్బు పక్కదారి పడుతుందేమోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక సాంకేతిక సమస్యలున్నా వెబ్‌సైట్‌ను అప్‌డేట్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.
- పీఎఫ్ సొమ్ము మంజూరులో సిబ్బంది చేస్తున్న తప్పిదాలను 11 పాయింట్స్‌గా గుర్తించి గత నెల 10న ఉపాధ్యాయ సంఘాలు జడ్పీ సీఈవోకు అందజేశారు. అయితే ఆయా తప్పిదాలకు సంబంధించి ఇంత వరకు పరిష్కారం చూపలేదు. ఇలా తాము దాచుకున్న సొమ్మును ఆర్థిక అవసరాల కోసం ఉపయోగించుకోవాలంటే పర్సంటేజీలు చెల్లించాల్సిన దుస్థితి వస్తోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యలపై అధికారులు దృష్టిపెట్టాలని లేకుంటే సమస్యను సంఘాల ద్వారా విద్యామంత్రి దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేస్తున్నారు.

కలగానే.. కనీస వేతనం

(5వ పేజీ తరువాయి)

అంతా ఆగిపోయింది.

బుట్టదాఖలు చేసిన ప్రస్తుత ప్రభుత్వం

2019 ఎన్నికల్లో నెగ్గిన వైసీపీ అధికారం చేపట్టడంతో కనీస వేతన సవరణకు మురసలం వచ్చింది. కనీస వేతన సలహాబోర్డు నివేదికను బుట్టదాఖలు చేసింది. ఆ తరువాత పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన బర్రె లీలను వేతన సవరణ బోర్డుకు చైర్మన్ చేసినప్పటికీ వేతన సవరణ ప్రక్రియ ఊసెత్తిన దాఖలాలు కూడా లేవు. మాటమాత్రంగానైనా వేతన సవరణ లేకుండా గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలాన్ని నెట్టేసింది.

17 లక్షల మంది ఎదురు చూపులు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 17 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులు ఉన్నారు. వీరంతా వ్యవసాయం, అనుబంధ రంగాల్లో దిన కూలీలుగా, నిర్మాణ కార్మికులుగా, సున్నం, ఇటుక బట్టీల్లో, షాపింగ్ కాంప్లెక్సులు, దుకాణాలు, ప్రైవేటు కంపెనీల్లో, ఆసుపత్రుల్లో పని చేస్తున్నారు. ఎలాంటి చట్టపరమైన భద్రత, వేతన భరోసా లేని వీరికి అన్యాయం జరగకుండా, పెరుగుతున్న నిత్యావసర ధరలు, జీవన ప్రమాణాలు, జీవన వ్యయాల పెరుగుదలను అధ్యయనం చేసి, కార్మికులతో చర్చించి తదనుగుణంగా ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు వేతన సవరణ సలహా బోర్డును ఏర్పాటు చేశారు. వేతన సవరణ సలహా బోర్డు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తుంటుంది.

కేంద్ర ప్రభుత్వం సవరణ?

తాజాగా కేంద్ర ప్రభుత్వం కార్మికుల కనీస వేతనాన్ని సవరించినట్లు వార్తలు ప్రముఖంగా వచ్చాయి. తాజా సవరణ ప్రకారం నిర్మాణం, స్వీపింగ్, క్లీనింగ్, లోడింగ్, అన్‌లోడింగ్‌లో పనిచేసే నైపుణ్యంలేని కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ. 783, నెలకు రూ. 20,358, సెమీ స్కిల్డ్ కార్మికులకు రోజుకు రూ. 868, నెలకు రూ. 22,568, నైపుణ్యం కలిగిన క్లరికల్, నిరాయుధ వాచ్‌మెన్‌కు రోజుకు రూ. 954, నెలకు రూ.24,804కు పెంచినట్లు కేంద్ర కార్మిక కమిషనర్ వెబ్‌సైట్లో సమాచారం ఉంచారు. ఇది ఎక్కడా అమలు కావడం లేదు. దీనిపై కార్మికుల్లో కూడా అవగాహన లేదు. కనీస వేతన నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వాలు చేతుల్లో వుండడంతో వారంతా కనీస వేతన సవరణ చేయాలని పెద్దఎత్తున డిమాండ్ చేస్తున్నారు.

నిద్రావస్థలో కార్మిక శాఖ

కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కార్మికశాఖ నిద్రావస్థలో మునిగిపోయింది. కార్మికులకు కనీస వేతనం దక్కక శ్రమ దోపిడీకి గురవుతున్నా కార్మికశాఖ ఎంతమాత్రం పట్టించుకోవడం లేదు. కార్మికుల తరుపున వేతన సవరణ బోర్డుకు సమస్యను నివేదించడంగానీ, అధికారులపై ఒత్తిడి తేవడంగానీ చేయడం లేదు. కనీసం ప్రభుత్వాల ప్రకటనలను, చట్టాలను కూడా కార్మికుల దృష్టికి తీసుకువెళ్లడం లేదు. వేతన సవరణ బోర్డు నిర్లక్ష్యం, కార్మిక శాఖ నిస్తేజం జిల్లాలో 17 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులకు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పటికీ గతంలో నిర్ణయించిన రూ.14 వేలే అధికారిక కనీస వేతనంగా కొనసాగుతుండడంతో వారికి శ్రమ ఫలితం దక్కడం లేదు. కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ కార్మికుల్లో వేతన సవరణ ఆశలు ఊపిరిపోసుకున్నాయి. 2018లో కూటమి ప్రభుత్వంలో సిద్ధం చేసిన నివేదిక ఆధారంగా, ఏడేళ్లలో జరిగిన మార్పులను దృష్టిలోవుంచుకుని కనీస వేతన సవరణ చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

బయ్యార్ పత్తి కొనటం లేదంటూ
రాస్తారోకో

జాతీయ రహదారికి ఇరువైపులా భారీగా నిలిచిన ట్రాఫిక్



జాతీయ రహదారిపై ట్రాక్టర్లు అడ్డంపెట్టి రాస్తారోకో చేస్తున్న రైతులు

నాదెండ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తేమశాతం, గుడ్డికాయ పేరుతో సీసీఐపత్తి కొనుగోలు చేయకపోవటంపై రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. గణపవరం గ్రామంలోని వెంకట కృష్ణ కాటన్ మిల్లులో నిర్వహిస్తున్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఎదుట జాతీయ రహదారిపై పత్తి బోరాల ట్రాక్టర్లు అడ్డుపెట్టి రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంటపాటు జరిగిన రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం గత శుక్రవారం ట్రాక్టర్లతో రైతులు సీసీఐ కేంద్రానికి పత్తిని తరలించారు. పత్తిని చూసిన సీసీఐ అధికారులు తేమ 12 శాతంకు పైగా ఉన్నందున తాము కొనలేమని, ఇళ్ల వద్ద ఆరబెట్టుకొని రావా లని తిరస్కరించారు. సోమవారం కూడా రైతులకు అదే పరిస్థితి ఎదురైంది. నాలుగు రోజులుగా ట్రాక్టర్లను అక్కడే పెట్టుకొని పడిగాపులు కాచిన రైతులు బయ్యార్ రమేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనగా జాతీయ రహదారిపై ఇరువైపులా ట్రాక్టర్లను అడ్డం పెట్టి రాస్తారోకో చేశారు.

తేమశాతం అటుఇటుగా ఉన్నా కొంటాం..

సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐలు పుల్లారావు, రహ్మతుల్లాలు సంఘటనా స్థలానికి వచ్చి రైతులతో మాట్లాడారు. జాతీయ రహదారిపై ధర్నా చేయటం తగదని రైతులకు వివరించారు. బయ్యార్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించుకుందామని సీఐ సుబ్బనాయుడు చెప్పటంతో ఆందోళన విర మించారు. అనంతరం బయ్యార్‌తో సీఐ, రైతులు సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే పత్తిని కొనుగోలు చేస్తున్నామని, తేమ, గుడ్డిపత్తి ఎక్కువగా ఉంటే తాను కొనలేనని బయ్యార్ రమేష్ తేల్చి చెప్పారు. ఈ విషయమై సీసీఐ జనరల్ మేనేజర్ అమర్నాథ్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. రైతులతో మాట్లాడిన ఆయన తేమశాతం కొద్దిగా అటుఇటుగా ఉన్నా కొనుగోలు చేస్తామని, ఎక్కువ ఉంటే కొనలేమని తెలిపారు. ఈ సమస్య విషయాన్ని మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, అచ్చెం నాయుడు, సీఎండీల దృష్టికి తీసుకు వెళ్లారని జీఎం వివరించారు. రైతులు సహకరించాలని కోరారు.

సీసీఐ కేంద్రాన్ని సందర్శించిన జేడీ

రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లలో ఉన్న పత్తి తేమ శాతాన్ని పరిశీలించారు. ఆరబెట్టిన పత్తిని లూజు రూపంలో గాని, గన్నీ బస్తాల్లో గాని కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. రైతుల వద్ద పత్తి ఉన్నంత కాలం సీసీఐ కేంద్రం ఉంటుందని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు యార్డు కార్యదర్శి యోగేశ్వరరావు ఉన్నారు.





మకరంద విన్యాసం

ఆహ్లాదకరమైన కార్తీమాస చల్లటి వాతావరణంలో ప్రకృతిలో ప్రతి అణువు పులకించిపోతుంది.... ఉద్యాన వనాల్లో సప్తవర్ణశోభితమైన పుష్పాలపై సీతాకోక చిలుకలు కొత్తగా రెక్కలు విప్పుకుని చేసే విన్యాసాలు అద్భుతంగా ఉంటాయి. ప్రకృతిలో మమేకమై పుష్పాల్లో మకరందాన్ని ఆస్వాదిస్తూ ఆనందంగా విహరించే ఈ దృశ్యాలు స్థానిక నల్లపాడు రైల్వేస్టేషన్ ఉద్యానవనంలో సోమవారం ఉదయం కనువిందు చేశాయి.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి



పంచాయతీ నిధులు దుర్వినియోగంపై విచారణ

పెదనందిపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రావిపాడులో గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్థుడు ఎం వెంకటేశ్వర్లు సీఎంవోలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం డీపీవో విచారణ చేపట్టారు. పంచాయతీ నిధులు వరగాని గ్రామ పంచాయతీ పరిధిలోని పొలిమేర డొంక మరమ్మతులకు వినియోగించారని, దీని వల్ల గ్రామంలోని డొంకలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరు పారుదల లేక వర్షపు నీరు పొలాల్లో నిలబడి పంటలు నష్టపోతున్నామని గ్రామస్థులు తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు డీపీవో తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణాన్ని పెంచాలి

● జేడీ నున్నా వెంకటేశ్వర్లు

వట్టిచెరుకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి విస్తీర్ణాన్ని పెంచాలని జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో పని చేస్తున్న క్యాడర్లందరికీ ఐసీఆర్‌పీ, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, ఎంటీలందరికీ ఐదు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన సాంకేతిక శిక్షణా కార్యక్రమాన్ని సోమవరం జేడీ వెంకటేశ్వర్లు ప్రారంభించి శిక్షణా తరగతుల ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ఈనెల 22వ తేదీ వరకు జరగనున్న శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, ఉద్యానశాఖ అధికారి రవీందర్, ఏవో, డీఎల్ఎంపీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

● ముప్పాళ్ల నాగేశ్వరరావు

మంగళగిరి సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలు ఇల్లు, నివేశన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లకు తగ్గకుండా ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి కనీసం రూ.5లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వంలో జగన్ విజయవాడ, మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని తదితర ప్రాంతాలకు చెందిన 55వేల మందికి సెంటు స్థలం చొప్పున అమరావతి రాజధానిలో కేటాయించి అమరావతిని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.

ఈ రోడ్లకు మోక్షమెప్పుడో..

● గుంతలమయంగా గ్రామీణ రహదారులు

● పట్టించుకోని అధికారులు



వరగాని-కొప్పర్రు రహదారిలో పడిన గుంతలు



పుసులూరు - పమిడివారిపాలెం రోడ్డు



అధ్వానంగా ఏబీపాలెం నుంచి గొట్టిపాడు వెళ్లే రహదారి

పెదనందిపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పట్టుకొమ్మలైన గ్రామాలకు సరైన వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లన్నీ గుంతలమయంగా, కంకర లేచి దర్శనమిస్తున్నాయి, ఈ రహదారిలో ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని వాహనదారులు వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రహదారులకు పిడికెడు మట్టికూడా వేయకపోవడం కారణంగా గ్రామ పంచాయతీ రహదారులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. వరగాని నుంచి కొప్పర్రు, ఏబీపాలెం నుంచి గొట్టిపాడు, పుసులూరు నుంచి పమిడివారిపాలెం వైపు వెళ్లే రహదారులన్నీ పూర్తిగా ధ్వంసమవడంతో అటుగా వెళ్లాలంటే గంటల కొద్దీ సమయం పడుతుందని ప్రయాణికులు అంటున్నారు. రాత్రి వేళల్లో ఏబీపాలెం నుండి గొట్టిపాడు వెళ్లే రహదారిలో ద్విచక్ర వాహనదారులు వెళ్లాలంటే ఖచ్చితంగా ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని వాపోతున్నారు. గతంలో ఈ రహదారుల్లో వాహనదారులు గోతులను తప్పించబోయే సమయంలో పలుమార్లు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు కొకొల్లలుగా ఉన్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రహదారుల మరమ్మతులకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసింది. అవి కేవలం ఆర్‌అండ్‌బీ రహదారులకు మాత్రమేనని, జిల్లా పరిషత్ రహదారులకు ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు ఎదురుచూస్తున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కనీసం గోతులను పూడ్చి, కంకర లేచిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం

● పీఆర్ ప్రాజెక్ట్ జేఈఈ వీ వెంకటరత్నం

మండలంలోని జిల్లాపరిషత్ రహదారుల మరమ్మతులపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టనున్నట్లు పీఆర్ ప్రాజెక్టు జేఈఈ వెంకటరత్నం తెలిపారు. 'స్వర్ణాంధ్ర 2047'లో భాగంగా రహదారుల మరమ్మతులకు జిల్లా పరిషత్ రోడ్లు వేస్తామని, రహదారులకు మరమ్మతులు చేపడుతున్నామని అన్నారు.

చట్టాలు ఆచరణ సాధ్యమైతే న్యాయం సుసాధ్యం

● సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య



పొనుగుపాడు సభలో మాట్లాడుతున్న సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య

ఫిరంగిపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చట్టాలు ఆచరణ సాధ్యమైతే బాధితులకు న్యాయం సుసాధ్యమని సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. సోమవారం మండలంలోని పొనుగుపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీఐడీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ చట్టం అవగాహన కార్యక్రమ సభలో ఆయన మాట్లాడారు. చెట్టుకు వేరు, భవనానికి పునాదులు ఎంత ముఖ్యమో చట్టానికి ఆచరణ అంతే ముఖ్యం అన్నారు. గ్రామీణ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ, చట్టం నిబంధనలు పాటించే అవగాహన కల్పించటం కోసం ప్రభుత్వ బాధ్యతగా ఈ సదస్సులను ఏర్పాటు చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాలకు సైతం పరిస్థితులను అవగాహన చేసుకోవటం, కొన్ని సేవా కార్యక్రమాలు చేయటం, ఎస్సీ, ఎస్టీ నాయకులను కలుపుకొని పోలీసు, రెవెన్యూ శాఖలు కలసి పథకాలు అమలు చేస్తూ వారి హక్కులను పరిరక్షించే విధంగా కృషి చేయాల్సి ఉందన్నారు. పేదలకు చట్టంపై అవగాహన ముఖ్యమన్నారు. అలాగే వారికి నిబంధనలు కూడా తెలియ జేయాల్సిన అవసరం ఉందన్నారు. దగా పడిన వారికి చేయూత అందించటమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. సేవా కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి సకాలంలో అందేలా అనుబంధ విభాగాలు పని చేయాల్సి ఉందన్నారు. మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై, కేసులపై దళిత నాయకులతో చర్చిస్తారన్నారు. అలాగే రాష్ట్ర స్థాయిలో రెండు నెలలకు ఒకసారి ఇలాంటి సమావేశాలు జరగటం వల్ల సమస్యలు లేకుండా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చట్టాన్ని అవగాహన చేసుకోవటమే దళితులకు ఔషధమన్నారు. పోలీసులు సకాలంలో స్పందించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐడీ సీఐ పూర్ణచంద్రరావు, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ ప్రసాద రావు, నరసరావుపేట మాజీ బార్ కౌన్సిల్ అధ్యక్షులు పిచ్చేశ్వరరావు, నరసరావుపేట న్యాయవాదుల విజయకుమార్, ఎం చంద్రశేఖర్, న్యాయవాది ఎం బాసి, డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంతి, తురకా వీరయ్య, పిల్లి రాజు, స్టాలిన్, గేరా కోటేశ్వరరావు, నాగరాజు, రామారావు, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

తాడికొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులకు న్యాయం చేసిన తరువాత నూతన రైల్వే లైన్ పనులు ప్రారంభించాలని తాడికొండ రైతులు తెలిపారు. సోమవారం తహసీల్దార్ నాసరయ్యకు రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రైతులకు తెలియకుండా రైల్వే అధికారులు రెండుసార్లు వ్యవసాయ భూముల్లో పెగ్ మార్కులు వేయటానికి వచ్చినప్పుడు అడ్డుకున్నట్లు తెలిపారు. రైతులందరు భూసేకరణకు వ్యతిరేకమని, భూసమీకరణకు అనుకూలమని పంచాయతీ తీర్మానం చేసినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లినట్లు తెలిపారు. అంతే గాకుండా రైతులందరు వ్యక్తిగతంగా అర్జీలను ఉన్నతాధికారులకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పేద కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ

మంగళగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మంగళగిరి నిడమర్రు రోడ్డులోని దళిత శిబిరంలో నివసిస్తున్న సైకిల్ మెకానిక్ యర్రమాల సిద్ధయ్య కుటుంబానికి విజయ హెల్త్ కేర్ ట్రస్టు తరపున నిత్యావసర సరుకులను అందజేశారు. అనారోగ్యం కారణంగా ఉపాధి కోల్పోవడంతో సిద్ధయ్య కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంది. విషయం తెలుసుకున్న ట్రస్టు వ్యవస్థాపకురాలు కాగితాల స్వాతి గౌడ్ గుంటూరుకు చెందిన మహిళా ఎస్ఐ రాణి సహకారంతో ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులను సోమవారం అందజేశారు.

ధాన్యం కొనుగోళ్లకు 156 రైతు సేవాకేంద్రాలు

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పౌరసరఫరాల సంస్థ గుంటూరు మేనేజర్ వై శ్రీలక్ష్మి సోమవారం తెలిపారు. మొత్తం 156 రైతు సేవా కేంద్రాలను 45 క్లస్టర్ పాయింట్‌లుగా ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వం గ్రేడ్-ఏ రకం క్వింటాల్‌కు రూ.2,321, 75 కేజీల బస్తాకు రూ.1,740, సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,300, 75 కేజీల బస్తా అయితే రూ.1,725గా నిర్ణయించిందన్నారు. రైతు సేవాకేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించదలచిన రైతులు సంబంధిత గ్రామ వ్యవసాయాధికారి(వీఏఏ) దగ్గర ధాన్యం కొనుగోలుకు షెడ్యూల్ చేయించుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా కంట్రోల్ రూం నంబరు. 9491392717కి ఫోన్ చేసి తెలియ జేయాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ సభ్యత్వానికి విశేష స్పందన



టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

తుళ్లూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వచ్చింది. తుళ్లూరు గ్రామ పార్టీ ఆధ్వర్యంలో లైబ్రరీ సెంటర్లో సోమవారం సభ్యత్వ నమోదు డ్రైవ్‌ను ఏర్పాటు చేయటంతో ఒక్క పూటలోనే 500 మంది సభ్యత్వం తీసుకున్నారు. ఫోన్‌లోనే నమోదు ప్రక్రియ నిర్వహించారు. మంగళవారం కూడా సభ్యత్వ నమోదు ఉంటుందని గ్రామ పార్టీ అధ్యక్షుడు కాటా అప్పారావు తెలిపారు. నియోజకవర్గ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చందు, టీడీపీ నేతలు జొన్నలగడ్డ కిరణ్, ఉప్పలపాటి సాంబశివరావు, బండ్ల పట్టాభిరామయ్య, జమ్ముల అనిల్, పాటి బండ్ల జయకృష్ణ, కొమ్మినేని రఘు, కొల్లి నరేంద్ర, గడ్డం వెంకటేశ్వరావు, గొట్టిపాటి రాజేష్, సభ్యత నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.


నేటి నుంచి మండలంలో ఆధార్ క్యాంపులు

మేడికొండూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలపరిధిలో స్కూళ్లు, కళాశాలల్లో, ఇతర విద్యాసంస్థల్లో ఆధార్ కార్డు లేని విద్యార్థులకు నూతన కార్డులను జారీ చేయడం కోసం ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో తోట చందన సోమవారం తెలిపారు. ఈనెల 19, 20వ తేదీల్లో పేరచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్లోను, 21, 22వ తేదీల్లో మేడికొం డూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలియజేశారు. ఈ క్యాంపుల్లో ఆరు సంవత్సరంలోపు అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలతో పాటు ప్రైమరీ, హైస్కూల్, కళాశాలలో చదువుకునే విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్‌తో పాటు ఆధార్ లేనివారికి కొత్తగా ఆధార్ ఎన్‌రోల్ మెంట్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రతి విద్యార్థికి ఆపార్ జారీ చేసేందుకు వీలుగా ఆధార్ కార్డులు అప్‌డేట్ చేయాల్సి ఉంటుందని అన్నారు.

● వట్టిచెరుకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల కోసం ఈనెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మండలంలోని అనంతవరప్పాడు హైస్కూల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది.

26న ఛలో గుంటూరును జయప్రదం చేయాలి

తాడేపల్లి టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అఖిల భారత రైతు సంఘాలు కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కేంద్రాల్లో ఈ నెల 26న నిరసన ర్యాలీలు జరపాలని నిర్ణయించామని చలో గుంటూరును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్ నేతల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి వేముల దుర్గారావు అధ్యక్షత వహించారు. జొన్నా శివశంకర్ మాట్లాడుతూ నిరసన కార్యక్రమంలో రైతులు, ట్రేడ్‌యూనియన్ నేతలు పాలొనాలన్నారు.



అద్దెకు కార్లు తీసుకుని తాకట్టు పెట్టేశారు

● చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అద్దెకు కార్లు తీసుకుని వాటిని తాకట్టు పెట్టారని పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన సాధనబోయిన రోహిత్‌కుమార్‌కు చెందిన రెండు కార్లను ఏలూరు జిల్లా ఏలూరు పత్తేబాద్‌కు చెందిన ఎల్లపు భానుచందర్, ఏలూరు పుష్పలీలానగర్‌కు చెందిన ముంగర అభిషేక్ అలియాస్ గణేష్‌లకు రెండు కార్లను అద్దెకు ఇచ్చారు. ఆ రెండు కార్లను వారిద్దరూ తాకట్టు పెట్టేసుకున్నారు. ఎంతకాలానికి అద్దె సొమ్ము కట్టడం కాని, కార్లు ఇవ్వడం కాని చేయకపోవడంతో అనుమానం కలిగిన రోహిత్ వచ్చి విచారణ చేశారు. ఆ కార్లు తాకట్టు పెట్టినట్లు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిద్దరిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని వారు తెలిపారు.

టీడీపీ మహిళా కార్యకర్తపై దాడి

● స్పందించిన నాయకులు



సీఐ కళ్యాణ్‌రాజుకు ఫిర్యాదు అందిస్తున్న బాధితురాలు మౌనిక

తాడేపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉండవల్లి సెంటర్ 15వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త మౌనికపై దాడి కేసులో పోలీసులు కేసు నమోదు చేశారు. కుటుంబ అవసరాల నిమిత్తం కృష్ణానది తీరాన కొబ్బరికాయలు, పూలు అమ్ముకుంటున్న తనపై ఆంజనేయస్వామి గుడి దుకాణదారుడు గుణశేఖర్ ఈ దాడికి పాల్పడ్డాడని మౌనిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపింది. సీతానగరం అంజనేయ స్వామి గుడికి సంబంధించిన దుకాణాన్ని వేలం పాటలో పాడుకొని ఆ సమీపంలో ఎవరూ ఎలాంటి చిరు దుకాణాలు పెట్టకుండా అనేకమార్లు దాడులకు తెగబడుతున్న గుణశేఖర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులకు విజ్ఞప్తి చేసింది. కాగా టీడీపీ కార్యకర్తలకు ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి లోకేశ్ అండగా ఉంటారని కార్యకర్తపై దాడి జరిగిన వెంటనే స్థానిక నాయకులను పంపించి బాధితురాలు మౌనికకు ధైర్యాన్ని ఇచ్చారని కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. కాగా దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకుని సీఐ కళ్యాణ్‌రాజు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం

తాడేపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం రైల్వే ట్రాక్ వద్ద సోమవారం గుర్తు తెలియని మృతదేహాన్ని తాడేపల్లి పోలీసులు కనుగొన్నారు. మృతుని వయస్సు 35-40 సంవత్సరాలు ఉండ వచ్చని, అతడి శరీరంపై తెలుపు, వంకాయ రంగు గీతలు కలిగిన ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నల్లప్యాంట్, హాఫ్ హ్యాండ్ బనియన్ ఉన్నాయని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు గుంటూరు జీఆర్‌పీ ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి 8328018787లో సంప్రదించాలని కోరారు.

మలినేనిలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం



శిక్షణకు హాజరైన అధ్యాపకులు

వట్టిచెరుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులను ఉన్నత స్థాయికి చేర్చటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీతో పోటీ పడాలని, అందుకు ఈ శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయని మలినేని విద్యాసంస్థల ఛైర్మన్ మలినేని పెరుమాళ్ళు అన్నారు. మండలంలోని పుల్లగుడిగుంట సమీపంలో మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆరు రోజుల ఉపాధ్యాయు ల నైపుణ్య శిక్షణా కార్య క్రమం సోమవారం ఏఐసీటీఈ, ఏటీఏఐ ఈడీయూ స్కిల్స్ అండ్ మైక్రో చిప్ సౌజన్యంతో ప్రారంభమయ్యాయి. కార్యక్ర మంలో వివిధ ప్రముఖ అధ్యాపకులను ఉద్దేశించి డాక్టర్ పెరుమాళ్ళు మాట్లాడారు. కార్యక్రమ కన్వీనర్ ఈసీఈ విభాగాధిపతి బీ విజయసారథి మాట్లాడుతూ ఈ నైపుణ్య శిక్షణాశిబిరం ద్వారా ఎంబేడెడ్ సిస్టమ్ స్మార్ట్ టెక్నాలజీ పరిశ్రమలు ఆశిస్తున్న నైపుణ్యాన్ని అధ్యాపకుల ద్వారా విద్యార్థులకు చేరవేయటం ముఖ్యఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, డీన్ అకడమిక్ ప్రొఫెసర్ జంపని కిషోర్‌బాబు, విభాగాధిపతులుపాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడుకు టీడీపీ నేతల నివాళి



రామ్మూర్తినాయుడు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతి తెలుగు దేశం పార్టీకి తీరనిలోటని టీడీపీ నేతలు పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో సోమవారం రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి మాట్లాడుతూ రామ్మూర్తినాయుడు చంద్రగిరి ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. నారా కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరిరావు, టీడీపీ నేతలు గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, గాదె పిచ్చిరెడ్డి, యర్రగుంట్ల భాగ్యారావు, మల్లవరపు వెంకట్, కారంపూడి అంకమ్మరావు, రంగిశెట్టి నరేంద్ర, కొమ్మా సుకుమార్, కొదమల సురేష్, తోట సాంబశివరావు, పేరం ఏడుకొండలు, గోసాల రాఘవ, రంగిశెట్టి పెద్దబ్బాయ్, యలమంచిలి పద్మజ, పద్మ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నేతలు సహకరించాలి

పెదనందిపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీ నేతలు సహకరించాలని తహసీల్దార్ శంకరబాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1630మంది పట్టభద్రులు ఓటు హక్కుకు నమోదు చేసుకున్నారని, 1100 ఓట్లు ఆన్‌లైన్లో నమోదు చేసినట్లు, ఆన్‌లైన్లో నమోదు చేసుకున్న ఓటర్ల జాబితాను 23వ తేదీన ప్రచురిస్తారని తెలిపారు. ఏవైనా చేర్పులు, మార్పులు వంటివి ఉంటే డిసెంబరు 9లోపు తెలియజేయాలన్నారు. డిసెంబరు 30న పూర్తిస్థాయి జాబితా ప్రచురిస్తారన్నారు. కార్యక్రమంలో డీటీ కరీముల్లా, నాయకులు శివరామకృష్ణయ్య, సత్యహర్ష, రమేష్‌బాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మురుగునీరు పారుదలకు చర్యలు చేపట్టాలి

● డీపీవోకు గ్రామస్థుల వినతి

పెదనందిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో మురుగునీటి పారుదలకు చర్యలు చేపట్టాలని కోరుతూ జిల్లా పంచాయతీరాజ్ అధికారి కె.శ్రీనివాసరావుకు పెదనందిపాడు గ్రామస్థులు సోమవారం విన్నవించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద కల్వర్టులు నిర్మాణం చేయకుండా మురగుకాలువపై తూములు ఏర్పాటు చేయడం వల్ల మురుగు నీరు పారుదల లేక ఆటంకం కలుగుతుందని, పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని, దీని వల్ల మురుగునీరు పొలాల్లోకి, జిల్లాపరిషత్ పాఠశాల ప్రాంగణంలోకి చేరుతుందని, దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని వెంటనే మురుగునీరు పారుదలకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ వెలనేని శివయ్య, టీడీపీ గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, నూతి శ్రీనివాసరావు, షేక్ ఖలీల్ పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి

మంగళగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు సిబ్బంది ఖాతాదారులకు మెరుగైన సేవలందించి వారి నమ్మకం, విశ్వాసం పొందాలని ఏపీ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఎం విశ్వ సూచించారు. మంగళగిరిలో ఆర్ అండ్ బీ బంగ్లా ఎదురుగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 47వ శాఖను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ మంగళగిరిలో చేనేతలు, రైతులు ఎక్కువగా ఉన్నారని, వారి ఆర్థికాభివృద్ధి కోసం సరళ విధానంలో రుణాలు ఇచ్చేందుకు ముం దుకు రావాలని కోరారు. విజయవాడ జోనల్ మేనేజర్ వైద్యనాథ్ మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని సూచించారు.

రూ. 50 లక్షల చిట్టీల సొమ్ముతో నిర్వాహకుడు పరార్

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా చీటీ పాటలు వేసి చివరకు పాడుకున్న వారికి డబ్బులు ఇవ్వకుండా రూ.50లక్షలతో నిర్వాహకుడు శివరామకృష్ణ పరారయ్యాడని బాధితులు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. చేబ్రోలుకు చెందిన శివరామకృష్ణ ఎన్నో సంవత్సరాలుగా నమ్మకంగా చీటీ పాటలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఇటీవల ఊరు నుంచి అదృశ్యమయ్యాడన్నారు. బాధితులు రాజు, వెంకటరావు, నాగవర్ధన్ తదితరులు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.



క్రైమ్ జోన్

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

తెనాలి, మారీసుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారీసుపేటకు చెందిన సుగ్గుల సత్యవతి అనే వృద్ధురాలు కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని దైవ దర్శనానికి ఆలయానికి వెళ్లింది. తిరుగు ఇంటికి నడుచుకుంటూ వస్తున్న క్రమంలో ఒక ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఆ వృద్ధురాలి వద్ద ఆగి 'ఈ చిరునామా ఎక్కడ?' అంటూ మాటలు కలిపారు. అనంతరం ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. అనంతరం బాధిత వృద్ధురాలు పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయానికి నాలుగు అర్జీలు

తెనాలి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు అందించినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. అందులో 3 రెవెన్యూ సమస్యలు కాగా 1 పంచాయతీరాజ్‌కు సంబంధించినదని వెల్లడించారు. తెలిపిన ప్రతి సమస్యపై త్వరితగతిన పరిష్కరించేలా కృషిచేయనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

ఇళ్ల మధ్యలో మేకల పెంపకంపై ఫిర్యాదు

తెనాలి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్యలో ఉన్న స్థలాన్ని ఆక్రమించి మేకల పెంపకం చేపట్టిన వ్యక్తిపై మండల తహసీల్దార్‌కు కొలకలూరు గ్రామానికి చెందిన డాక్టర్ పూర్ణప్రజ్ఞాచారి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పూర్ణప్రజ్ఞాచారి మాట్లాడుతూ కొలకలూరులోని బీసీ కాలనీలో ఇళ్ల మధ్యలో కోడూరు వెంకయ్య స్థలాన్ని ఆక్రమించి మేకల పెంపకం చేపట్టాడని, చుట్టుపక్కల నివాసితులు అనారోగ్య సమస్యలు బారిన పడే అవకాశం ఉందని ఫిర్యాదుచేశారు. దీనిపై ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. దీనిపై విచారించి తమకు న్యాయం చేయాలని పూర్ణప్రజ్ఞాచారి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

ఎన్ఎన్‌టీ పబ్లిక్ స్కూల్‌లో బాలల దినోత్సవం

పొన్నూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎన్ఎన్‌టీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కొలిపర్తి శివనాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఎన్ఎన్‌టీ పబ్లిక్ స్కూల్‌లో బాలలు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను సత్కరించి నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా పాలు పంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొలిపర్తి బాబారత్నం, పాఠశాల ఇన్‌చార్జి వెలనాటి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలి

గుంటూరు తూర్పు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నివాస ప్రాంతంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరుతూ పెదకాకాని మండలం, నంబూరు గ్రామానికి చెందిన ఎస్.సోమగోపాలరెడ్డి సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టరుని కలసి వినతిపత్రం అందజేశారు. నివాస గృహాలు, దేవాలయం, ప్రభుత్వ కార్యాలయాల మధ్య మద్యంషాపుని ఏర్పాటు చేశారని, దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దేవాలయ ఆవరణలోనే మందుబాబులు మద్యం తాగుతున్నారని వివరించారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఆ ప్రాంతం నుంచి మద్యం దుకాణాన్ని తరలించాలని కోరారు.

కుంగ్‌ఫూలో రషీద్‌వలికి బంగారు పతకం



గోల్డ్ మెడల్స్ సాధించిన రషీద్‌వలి

తెనాలి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నార్ఐ డిగ్రీ కళాశాలలో చదువుతున్న రషీద్‌వలి ఆదివారం విజయవాడలో నిర్వహించిన కుంగ్‌ఫూ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా రషీద్‌వలిని సోమవారం కళాశాలలో సీఈవో ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ లాజరుబాబు, అధ్యాపకులు, కోచ్ జానీబాషా తదితరులు అభినందించారు.

సిబ్బంది ప్రవర్తనతో మసకబారుతున్న ఆలయ ప్రతిష్ఠ

- అర్చకుల ప్రవర్తనతో భక్తులు దూరం
- వైసీపీ పాలనలో భూముల అన్యాక్రాంతంపై ఆరోపణలు
- అనుమతులు లేకుండా కుంభాభిషేకం, అక్రమ వసూళ్లు



శ్రీసాక్షి భవనారాయణస్వామి ఆలయం



విచారణ జరుపుతున్న డీసీ శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

పొన్నూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో పురాణ ప్రసిద్ధి చెందిన శ్రీసాక్షి భవనారాయణ స్వామి ఆలయ ప్రతిష్ఠ నానాటికి దిగజారే పరిస్థితులు నెలకొన్నాయి. పొన్నూరు పట్టణంలోని మహిమాన్విత పుణ్యక్షేత్రం, సాక్ష్యమిచ్చే దేవుడిగా సాక్షి భవనారాయణ స్వామి స్వయంభుడై కొలువుతీరాడు. ఈ ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఈ ఆలయం క్రీస్తు శకం 6వ శతాబ్దం నుంచే విశిష్టత కలిగివున్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. క్రీస్తు శకం 9వ శతాబ్దంలో రాజా కుళోత్తుంగ చోలుడు స్వామి వారికి మండపాలు నిర్మించి దైవ పూజలు చేసినట్లు శాసనాలు ఉన్నాయి. అనేక శతాబ్దాల పాటు ఎందరో రాజులు, చక్రవర్తులు స్వామి వారిని సేవించి తరించారు. అమరావతి ప్రభువులుగా గుర్తింపు పొందిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు వారసులు ఈ ఆలయ అనువంశిక ధర్మకర్తలుగా ప్రస్తుతం వ్యవహరిస్తున్నారు. స్వంభువు సాక్షి భవనారాయణ స్వామికి వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు హయాంలోనే వేలాది ఎకరాల భూములను ఆలయ కైంకర్యాల కోసం కేటాయించారు. గత కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానికే సాక్షి భవనారాయణ స్వామి ఆలయం నుంచి నిధులు అందచేసిన ఘన చరిత్ర ఉన్నది. ఆలాంటి ఆలయం నేడు పూజారులు, గత పాలకుల నిర్వాకంతో అప్రదిష్టపాలవుతుందని భక్తులు తీవ్ర మనోవేదనలో ఉన్నారు. ఆలయానికి సంబంధించి కొంతమంది అర్చకుల తీరుతో ఆలయ ప్రతిష్ఠ మంట కలిసిపోతుందనే ఆవేదన భక్తుల్లో సర్వత్రా వ్యక్తం అవుతోంది.

అర్చకుల ప్రవర్తనపై సమగ్ర విచారణ

పొన్నూరు సాక్షి భవనారాయణ స్వామి ఆలయంలో అర్చకుల ప్రవర్తనపై ఇటీవల డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు సమగ్ర విచారణ జరిపారు. ఆలయంలో పనిచేస్తూ ప్రభుత్వ వేతనం పొందుతున్న ఇద్దరు అర్చకులు వ్యవహార శైలిపై దేవదాయ శాఖ కమిషనర్‌కు భక్తులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులతో అమర్యాదగా వ్యవహరించటంతోపాటు ధూషణలకు దిగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. మహిళా భక్తులతో అర్చకులు వ్యవహరిస్తున్న తీరు దేవాలయ వ్యవస్థకే కళంకం తెచ్చేలా ఉందని భక్తులు తీవ్ర మనోవేదనలో ఉన్నారు. అంతేకాకుండా వైసీపీ ప్రభుత్వంలో ఈ అర్చకుల ఆరాచకాలు పతాకస్థాయికి చేరాయి. ఆలయ పాలక మండలితో కానీ, అధికారులతో కానీ అనువంశిక ధర్మకర్తలతో కానీ సంబంధం లేకుండా ప్రత్యేక పూజల పేరిట, ఆలయ నిర్మాణాల పేరిట లక్షలాది రూపాయల నిధులను సేకరించి సొంతానికి వినియోగించుకోవటమే కాకుండా నిధుల వివరాలను దేవాదాయ శాఖకు లెక్కలు చెప్పకుండా జేబులో వేసుకున్నారని అభియోగాలు ఉన్నాయి. ఆగమ శాస్త్రాలకు విరుద్ధంగా దక్షిణాయనంలో మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఈ కుంభాభిషేకానికి దేవదాయ శాఖ అనుమతులు ఇవ్వకపోయినప్పటికి ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో వైసీపీ పాలకుల పర్యవేక్షణలో సుమారు రూ.55 లక్షలు భక్తుల నుంచి సేకరించినట్లు సమాచారం. ఈ వసూలైన నిధుల వినియోగంపై కూడా తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. కేవలం 10, 15 లక్షలతో భక్తులు లేకుండా నామమాత్రంగా కుంభాభిషేకం నిర్వహించి భారీగా నిధులు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపారని భక్తులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. అలాగే దేవాలయానికి సంబంధించి వంశపారంపర్య హక్కులు లేకపోయినప్పటికి అడ్డదారిలో ప్రభుత్వ స్కేలు పొంది అర్చకత్వం చేస్తున్నారని తోటి అర్చకులే ఆరోపణలు చేస్తున్నారు. ఈ అర్చకుల వ్యవహార తీవ్ర వివాదాస్పదంగా మారింది.

భూముల అన్యాక్రాంతంపై ఆరోపణలు....

వైసీపీ ప్రభుత్వం హయాంలో సాక్షి భవనారాయణ స్వామి ఆలయానికి చెందిన భూములు అన్యాక్రాంతం చేయటానికి ప్రయత్నాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. గుంటూరు జిల్లాలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రంగా కోట్లాది విలువైన ఆస్తులు కలిగిన దేవాలయంగా సాక్షి భవనారాయణ స్వామి ఆలయానికి పేరు ఉండేది. ప్రస్తుతం ఆలయానికి 300 ఎకరాల భూములు ఉన్నాయి. పొన్నూరు ప్రధాన రహదారి జీబీసీ రోడ్డుకు ఇరువైపులా పట్టణ శివారులో ఎకరం కోట్లాది రూపాయలు పలికే భూమి ఉంది. ఇలాంటి విలువైన భూములపై గత ప్రభుత్వ హయాంలో ఆటోనగర్ నిర్మాణం పేరుతో భూములు అన్యాక్రాంతం చేయటానికి ప్రయత్నాలు చేశారని ప్రస్తుత ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అనేక ఉద్యమాలు చేశారు. ఆటోనగర్ పేరుతో మభ్యపెట్టి ప్రైవేటు వ్యక్తులకు లీజులకు ఇచ్చేలా ప్రభుత్వం నుంచి గత పాలకులు అనుమతులు తెచ్చారని నరేంద్ర కుమార్ ఆరోపించారు. హిందూ సంఘాలు, భక్తులు, అప్పటి ప్రతిపక్షమైన టీడీపీ కలిసి చేసిన పోరాటాలతో ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా ఆగాయి. ఏది ఏమైనప్పటికి అత్యంత ప్రాశస్త్యం కలిగిన సాక్షి భావనారాయణ స్వామి ఆలయ ప్రతిష్ఠ అర్చకుల తీరుతో అప్రతిష్టపాలవుతోందని భక్తులు తీవ్ర మనోవేదనలో ఉన్నారు. ఇప్పటికే అర్చకుల తీరుతో భక్తుల రాక పూర్తిగా నిలిచిపోయింది. ఇలాంటి స్థితిలో ఆలయానికి తిరిగి ప్రాభవం తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని భక్తులు వేడుకుంటున్నారు. దేవదాయశాఖ ఉన్నతాధికారులు భవనారాయణ స్వామి ఆలయంపై దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆలయ ప్రతిష్ఠ మసకబారిపోతుందని ఆందోళనలో ఉన్నారు.

కొలిక్కి రాని బిల్లుల పంచాయితీ

- గట్టుచప్పుడు కాకుండా గుంటూరులో విచారణ

పొన్నూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు తహసీల్దారు కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికల నిధుల జమా ఖర్చుల విషయంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై అధికారులు గుట్టు చప్పుడు కాకుండా విచారణ సాగిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంలో పొన్నూరు నియోజకవర్గానికి ఎన్నికల నిర్వహణ ఖర్చు నిమిత్తం మొదటి, రెండు దఫాలుగా సుమారు రూ. 2.14 కోట్లు మంజూరైచేసి, ఆ బిల్లులను చెల్లించింది. ఆ నిధులు సరిపోలేదని అప్పట్లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించగా ఇటీవల రూ.82 లక్షలు మంజూరు చేశారు. ఈ బిల్లు చెల్లింపు విషయంలో వివాదం చెలరేగింది. గతంలో పనిచేసిన అధికారులు బదిలీపై వెళ్లిపోయారు. దీంతో ఆ బిల్లుల చెల్లింపు వివరాలు అందుబాటులో లేవని అనంతరం వచ్చిన అధికారులు చెల్లింపులను నిరాకరించారు. ఇక్కడ ఎన్నికల విధులు నిర్వహించి అనంతరం బదిలీపై వెళ్లిన డిప్యూటీ తహసీల్దారు ఐ ప్రశాంతి తాను సొంత నిధులు వినియోగించానని, వాటిని చెల్లించాలని సమర్పించిన బిలులు కొంత వివాదాస్పదంగా మారాయి. చివరికి ఈ విషయం కలెక్టరు దృష్టికి చేరటంతో కలెక్టరు విచారణకు ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి మస్తాన్ వలీతోపాటు, జిల్లా ఆడిట్ ఆఫీసర్లను విచారణ అధికారులుగా నియమించారు. అయితే ఈ విచారణ పొన్నూరులో కాకుండా గుంటూరులో రహస్యంగా చేస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా శనివారం రాత్రి, ఆదివారం డీఆర్వో కార్యాలయంలో రహస్యంగా విచారణ జరిపినట్లు సమాచారం. పొన్నూరులో బహిరంగ విచారణ జరిపితే తప్ప వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, ఆ వైపుగా విచారణ కొనసాగించాలని పొన్నూరు వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో క్విజ్ పోటీలు

తెనాలి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మండలంలోని శాఖ గ్రంథాలయాల్లో కొనసాగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం కొలకలూరు శాఖ గ్రంథాలయంలో ఆ కార్యాలయ అధికారి కడియాల సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులకు సభ్యత్వ నమోదులు జరిపి క్విజ్ పోటీలు నిర్వహించారు. సంగంజాగర్లమూడి శాఖ గ్రంథాలయంలో ఆ శాఖ అధికారి జె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. పెదరావూరు శాఖ గ్రంథాలయంలో ఆ శాఖ అధికారి ఎ.రాఘవేంద్రరావు పర్యవేక్షణలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు స్కూల్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

- కొల్లిపర: సోమవారం మండల పరిధిలోని మున్నంగిలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంఈవో సాల్మన్‌రాజు, గ్రంథాలయ అధికారులు సుబ్బారావు, నాగసాంబశివ నాయక్, జ్యోతి, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.
- తెనాలి అర్బన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నెహ్రూరోడ్డులోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాయపాటి శివనాగేశ్వరరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. లైబ్రేరియన్ కే.రమాదేవి, సిబ్బంది ఈ పోటీలను పర్యవేక్షించారు. అలాగే కొత్తపేట మహిళా, బాలల గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ అంజని, కిరణ్‌కుమార్, సరస్వతి పోటీలను పర్యవేక్షించారు.

నిత్యావసరాలు, దుస్తుల పంపిణీ

తెనాలి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐతానగర్ ప్యాడిసన్‌పేటలో సోమవారం ఈరే మినిస్ట్రీస్‌లో పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేశారు. బిషప్ కత్తెర సుధీర్‌కుమార్ జన్మదినం పురస్కరించుకుని నిర్వహించిన సేవా కార్యక్రమంలో సంతోష కుమారి, ఈశ్వర్, కృపాదానం, త్యాగరాజు, నాని, ఆనంద్ పాల్గొన్నారు.



పేదలకు నివేశన స్థలాలు అందించాలని నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

పొన్నూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలో పట్టణంలోని వార్డులో నిరుపేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని 25వ వార్డు సచివాలయం వద్ద సోమవారం భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో నివేసన స్థలాల కోసం నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. వినతిపత్రం సమర్పించిన అనంతరం రామారావు మాట్లాడుతూ ఇల్లులేని నిరుపేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఆ స్థలాల్లో పక్కా ఇళ్లు నిర్మించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట నిలుపుకోవాలని కోరారు. ఇంటి స్థలం ఉన్న వారికి ఇల్లు నిర్మాణం కోసం రూ.5 లక్షలు గృహ నిర్మాణశాఖ ద్వారా మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంలో చంద్రబాబు సెంటున్నర స్థలాల్లో పేదలు ఎలా నివసిస్తారని వైసీపీ పాలకులను ప్రశ్నించారన్నారు. ఇచ్చిన మాట నిలుపుకొని పేదలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రావూరి సుగుణ, సీపీఐ నాయకులు దేవరకొండ శ్రీనివాస్, అయ్యప్ప, వలీ, కోటేశ్వరమ్మ, మున్ని, మోతి, జరీనా, గౌసియా, లక్ష్మీ, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన పెదకాకాని శివయ్య సన్నిధి



పెదకాకాని శివాలయం క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు

పెదకాకాని, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాస మూడో సోమవారం సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్ర నలుమూలల నుంచి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపారాధనలు చేశారు. క్యూ లైనులో దర్శనం, స్వామి వారికి అభిషేకాలు జరిపించుకున్నారు. క్యూలైన్లలో భక్తులకు ఉచితంగా పాలు, మజ్జిగ, మంచినీళ్ళ బాటిల్స్ అందించారు. వివిధ సేవా రుసుములు, ప్రసాద విక్రయం, అన్నప్రసాద విరాళాల ద్వారా ఏడు లక్షల ఆదాయం వచ్చినట్లు దేవస్థాన ఉపకమీషనరు కె.బి.శ్రీనివాసరావు తెలిపారు.

కొల్లిపర: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని దేవాలయాల్లో వైభవంగా పూజలు నిర్వహించారు. కార్తీక మాసం మూడో సోమవారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో కృష్ణానదిలో స్నానాలు చేసి పసుపుతో వినాయకుడిని చేసి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. కృష్ణానది ఒడ్డున ఉన్న లక్ష్మీతిరుపతమ్మ ఆలయాల్లో కూడా పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు శివాలయాలకు చేరకుని 365 ఒత్తులను వెలిగించారు.

ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలుచేయాలి: ములకా

తెనాలి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టరు కార్యాలయంలో సబ్ కలెక్టరు సంజన సిన్హాకు వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం క్వింటా ధాన్యం ధర రూ.2320 ఉందని, 75 కిలోల బస్తాకు రూ.1740 వస్తుందని, ఆ ప్రకారం కొనుగోలు జరపాలని సబ్ కలెక్టరుని కోరారు.

నిర్ణీత సమయంలోనే సరుకులు పంపిణీ చేయాలి

- రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో తహసీల్దారు గోపాలకృష్ణ

తెనాలి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు నిర్ణీత సమయంలోనే రేషన్ సరుకులను పంపిణీ చేయాలని తహసీల్దారు గోపాలకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో గోపాలకృష్ణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్‌డీలర్లు స్టాకు రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. కార్డుదారునికి బియ్యం ఇతర సరుకులను తప్పక అందించాలని ఎండీయూ ఆపరేటర్లను ఆదేశించారు. రేషన్ సరుకులు నల్లబజారుకి తరలిస్తున్నట్లు తనకు ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీటీ మూర్తి, పలువురు రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.



చిరు వ్యాపారులతో సమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు

రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించొద్దు

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి మారీసుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులు రోడ్డు మార్జిన్‌లను ఆక్రమించి వ్యాపారాలను నిర్వహించవద్దని పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని మహాత్మాగాంధీ మున్సిపల్ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద సోమవారం కూరగాయలు, చికెన్, మటన్, చేపల వ్యాపార సంఘ సభ్యులతో మున్సిపల్ అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్నలు పాల్గొని చిరు వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు వ్యాపారులతో మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు తమకు కేటాయించిన షాపులను వదలి రోడ్లను ఆక్రమించి వ్యాపారాలను నిర్వహించరాదన్నారు. వ్యాపారాలు నిర్వహించడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వారికి కేటాయించిన షాపులలోనే వ్యాపారాలను నిర్వహించాలని లేకుంటే పురపాలక సంఘం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీప్లానర్ శ్రీమన్నారాయణ, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, రెవెన్యూ ఆఫీసర్ రాంప్రసాద్, హోల్‌సేల్ మార్కెట్ అధ్యక్షుడు యారవ కాశీరెడ్డి, కామిశెట్టి చెన్నారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయిన్‌లలో వ్యర్థాలను తొలగించండి: చైర్‌పర్సన్

తెనాలి మారీసుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్‌లలోని వ్యర్థాలను తొలగించాలని పారిశుధ్య కార్మికులను పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. సోమవారం పట్టణంలోని 13, 14వ వార్డులలో జరగుతున్న పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో అధికారులతో కలసి పరిశీలించి శానిటరీ సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు కుర్రా సుజాత, దాసరి వీరవసంతరావు, అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు, మున్సిపల్ ఏఈ సూరిబాబు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు

- ఎంపీడీవో రమావత్ శ్రీనివాసరావు





పెదకాకాని, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎంపీడీవో రమావత్ శ్రీనివాసరావు సోమవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. అభివృద్ధి పనులు, పలు విషయాలపై ఎంపీడీవో తెలిపిన వివరాలు.

ప్రశ్న: మండలంలో ఎన్ని కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు.?

జ: మండల పరిధిలోని 12 పంచాయతీలో రూ.కోటి 25లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టాం.

ప్రశ్న: అభివృద్ధి పనుల్లో ఏ ఏ పనులు చేస్తున్నారు?

జ: పాడైపోయిన రోడ్లకు మరమ్మతులు, అనేక గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నాం.

ప్రశ్న: ఎంతమందికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారు?

జ: ఇప్పటివరకు 14,500మందికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. వచ్చే నెలలో అర్హత ఉన్న వారిని ఎంపికచేసి, వారికి 2025 జనవరి నుంచి కొత్త పింఛన్లు అందజేస్తాం.

ప్రశ్న: గోకుల్ స్కీమ్ కింద లబ్ధిదారులకు ఎంతెంత రుణాలు ఇస్తున్నారు?

జ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గోకుల్ స్కీం కింద ఒక్కొక్క లబ్ధిదారుడికి 50శాతం సబ్సిడీ మేరకు రుణాలు ఇస్తున్నాం. అందులో 4 గేదెలు ఉన్న వారికి రూ.1.80లక్షలు, ఆరు గేదెలున్నవారికి రూ.2.30లక్షలు అందజేస్తున్నాం.

ప్రశ్న: డ్వాక్రా సంఘాల బలోపేతానికి ఏం చర్యలు చేపట్టారు?

జ: మండలంలోని గ్రామాల్లోని మహిళలందరినీ డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు (సీవో)లను ఆదేశించాం. త్వరలో వీరందరినీ డ్వాక్రా గ్రూపుల్లో చేర్పిస్తాం.



మార్కెట్‌లో ఆక్రమణలను తొలగించి, పారిశుధ్య చర్యలు చేపట్టిన ప్రాంతం

మార్కెట్ వద్ద పారిశుధ్య చర్యలు

తెనాలి, మారీసుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'అధ్వాన పారిశుధ్యం'తో అవస్థలు అనే శీర్షికన ఈ నెల 4న ఆంధ్రజ్యోతి దిన పత్రికలో కథనం ప్రచురితం కావడంతో కూరగాయల మార్కెట్ వద్ద రోడ్లను ఆక్రమించి చికెన్ షాపులను నిర్వహిస్తు, రోడ్లపైనే వ్యర్థాలు వేస్తున్న వారిపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. సోమవారం షాపుల ఆక్రమణలను తొలగించి, ఆ ప్రాంతంలో పారిశుధ్య చర్యలను చేపట్టారు.



ఆక్రమణలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

డ్రెయిన్‌లపై ఆక్రమణల తొలగింపు

తెనాలి, మారీసుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రెయిన్‌లపై ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగించారు. సోమవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులో మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో డ్రెయిన్‌లపై ఆక్రమణలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ టీపీవో సాంబశివరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బగళాముఖి ఆలయానికి పాదయాత్రగా వెళుతున్న తెలుగు మహిళలు

బగళాముఖి ఆలయానికి తెలుగు మహిళల పాదయాత్ర

పొన్నూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు సముచిత స్థానం దక్కాలని సోమవారం పొన్నూరు పట్టణ, మండలానికి చెందిన తెలుగు మహిళలు పాదయాత్ర నిర్వహించారు. పొన్నూరు పట్టణం నుంచి బాపట్ల జిల్లా చందోలులోని బగళాముఖి అమ్మవారి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి నరేంద్ర కుమార్‌కు క్యాబినెట్ స్థాయి పదవులు దక్కాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు పాల్గొన్నారు.

పురపాలక సంఘంలో గ్రీవెన్స్‌కు ఒక అర్జీ

తెనాలి, మారీసుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు ఒకే ఒక్క అర్జీ వచ్చిందని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు ఒక తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఇంటికి ఉన్న నీటి కనెక్షన్‌ను తొలగించాలని ఓ వ్యక్తి ఇంజనీరింగ్ శాఖ విభాగానికి అర్జీ అందజేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.

సుద్ధపల్లిలో దొంగల ముఠా ఆగడాలు అరికట్టండి

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండల పరిధిలోని సుద్ధపల్లిలో ఓ దొంగల ముఠా చేస్తున్న ఆగడాలతో తమ గ్రామం పరువు పోతుందని, అంతేగాక వారు తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని సోమవారం బాధితులు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సుద్ధపల్లి గ్రామంలోని వడ్డెర కాలనీలో కొందరు యువకులు అనేక సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ముఖ్యంగా నకిలీ బంగారం అంటగట్టడం, ఆభరణాలు లభ్యమయ్యాయంటూ నకిలీ బంగారాన్ని అంటగట్టి లక్షలాది రూపాయలు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ముఠాపై కేసులు ఉన్నాయన్నారు. ఈ ముఠా వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు కూడా పాల్పడుతుంటారన్నారు. వీరిపై కేడీ షీట్లు కూడా ఉన్నాయన్నారు. దొంగతనాలు చేయవద్దంటూ కాలనీ పెద్ద ఆలకుంట శ్రీను వారిని ఇటీవల మందలించగా ఈ ముఠా సభ్యులు హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. ఇంతలో కాలనీలోని మరికొందరు జోక్యం చేసుకోవటంతో వెళ్లిపోయారన్నారు. అయితే రెండు రోజులుగా శ్రీనును చంపడానికి ఈ ముఠా మారణాయుధాలతో తిరుగుతోందని ఫిర్యాదు చేశారు.